thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

**మంధాన మరో మైలురాయి..**



11


# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 151 | జగిత్యాల శుక్రవారం 04 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా





- పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు
- ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య
- ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ
- ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్
- దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు

2

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు.



# ఏ దేశమూ ఇరాన్‌కు సాయం చేయొద్దు

- అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీలో వ్యాఖ్యలు

4

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు.



# కొండా సురేఖ బర్తరఫ్

## నన్ను తొలగించడం సీఎం కుట్రే

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

.. వివరాలు 2లో

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది.

# రామ మందిర్ సీఈవో నియామకంపై రాజకీయం

**కాంగ్రెస్ అనుమానాలు.. బీజేపీ ఘాటు ప్రత్యుత్తరం**



4

అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈఓగా భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. సైనిక అధికారికి రామ మందిర ట్రస్ట్ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయగా, బీజేపీ సైతం అంతే ఘాటుగా ఎదురుదాడికి దిగింది.

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

.. వివరాలు 2లో



# కర్రెగుట్టల్లో మందుపాతర పేలి గిరిజనుడి మృతి

- వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లి విషాదం
- మృతుడు వెదుల్లచెరువుకు చెందిన మడకం నాగేశ్వరరావు
- పాత మందుపాతరగా అనుమానిస్తున్న పోలీసులు
- అటవీ ప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్

3



# నల్సార్ విద్యార్థులకు సుప్రీం ఊరట



- విద్యార్థులపై చర్యలకు బీసీఐకి అధికారం లేదు
- న్యాయవాదులుగా నమోదైన వారికే అధికార పరిధి
- బీసీఐ వైఖరిని తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- 2026 బ్యాచ్‌పై ఆంక్షలతో చెలరేగిన వివాదం
- సుమోటో విచారణలో కీలక స్పష్టత

2

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్‌కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. బీసీఐ అధికార పరిధి న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారిపై ఆ అధికారాన్ని ప్రయోగించలేదని పేర్కొంది. ఈ మేరకు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు భారీ ఊరటనిచ్చేలా కీలక స్పష్టత ఇచ్చింది.

# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి



- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
- బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

3

# కొండా సురేఖ బర్తరఫ్



# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

## సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

## ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి

## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

## కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్

## బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

## మంత్రివర్గం నుంచి ఉద్వాసన

## రాజీనామాకు నిరాకరించిన సురేఖ

## బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్

## గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ

## సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..

## చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

**హైదరాబాద్,సెప్టెంబర్3 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది.



సురేఖ న్యూదిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# నన్ను తొలగించడం సీఎం కుట్రే

## బర్తరఫ్ పై మీడియా సమావేశంలో సురేఖ

## అధిష్టానానికి పంపిన లేఖ కొండా రిలీజ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** మంత్రి పదవి నుంచి తనను తొలగించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. తనను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే తానే తప్పుకొంటానంటూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. "నన్ను బర్తరఫ్ చేస్తారా?.. నన్నే వెళ్లిపొమ్మంటారా?" అంటూ అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేసి తనను తొలగించేలా చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తాను కాంగ్రెస్‌ను వీడే ఆలోచనలో లేనని, పార్టీపై తన విశ్వాసం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తన తొలగింపుపై గురువారం మీడియాతో మాట్లాడిన సురేఖ.. కనీసం తన వివరణ కూడా తీసుకోకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. రాజీనామా చేయాలని తనను ఎవరూ అడగలేదని, అధిష్ఠానం నుంచి ముందస్తుగా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. "ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారు. కానీ నా విషయంలో కనీసం వివరణ కూడా అడగలేదు. పదవి పోయిందనే బాధ నాకు లేదు. కారణం చెప్పకుండా అవమానకరంగా తొలగించడమే బాధిస్తోంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడాన్ని సురేఖ తప్పుబట్టారు. సుస్మితకు స్వతంత్ర వ్యక్తిత్వం ఉందని, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము ఆ వ్యాఖ్యలు చేయించలేదని స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఇతర కాంగ్రెస్ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుందని నిలదీశారు. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో ముఖ్యమంత్రి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించిన నాయకుడు రేవంత్‌రెడ్డేనని సురేఖ చెప్పారు. ఆయన పీసీసీ అధ్యక్షుడు కావాలని, ముఖ్యమంత్రి కావాలని కోరుకున్న వారిలో తాను ముందున్నానన్నారు. అయినప్పటికీ తనపై కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు కుట్ర చేశారని ఆరోపించారు. తనతో పాటు తన మాజీ ఓఎస్‌డీ సుమంత్ కుటుంబాన్ని కూడా కావాలనే వేధించారని విమర్శించారు. సుమంత్‌పై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రిగా ఉన్నప్పటికీ తనకు పూర్తి అధికారాలు లేకుండా చేశారని సురేఖ ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తన ప్రమేయం లేకుండానే జరిగాయని చెప్పారు. తనకు తెలియకుండానే మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను తొలగించారని పేర్కొన్నారు. తన శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి విషయంలోనూ వివక్ష చూపారని విమర్శించారు. "మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి. ఎమ్మెల్యేలు, మంత్రుల్లో అసంతృప్తి ఉందన్న విషయం అందరికీ తెలుసు. పనులు జరగాలంటే ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉంది" అని సురేఖ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందని కూడా ఆమె పేర్కొన్నారు. తనపై చర్యలకు ముందే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాసిన వివరణాత్మక లేఖను సురేఖ మీడియాకు విడుదల చేశారు. ఆగస్టు 23న రాసినట్లు పేర్కొన్న ఆ లేఖలో బీసీ మహిళా మంత్రిగా తాను రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. 31 ఏళ్ల రాజకీయ ప్రస్థానం, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తన అధికారాలను క్రమంగా కుదించారని లేఖలో ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే నేరుగా వెలువడుతున్నాయని పేర్కొన్నారు. యాదాద్రి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు విషయంలో తనను సంప్రదించలేదని, సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులను రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫొటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



వరంగల్ తూర్పులో స్మార్ట్ సిటీ, మోడల్ బస్‌స్టాండ్, బొందివాగు విస్తరణ తదితర అభివృద్ధి పనులకు నిధులు ఆలస్యమవుతున్నాయని కూడా లేఖలో ప్రస్తావించారు. తన ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను సైతం అధిష్ఠానానికి అందించినట్లు తెలిపారు. తన తదుపరి కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సురేఖ స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలపై తమకు అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్‌పై తన విశ్వాసం చెక్కుచెదరలేదని చెప్పారు. అయితే సురేఖ ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయవచ్చంటూ రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. బీజేపీ నుంచి ఆహ్వానం అందిందని, బీఆర్ఎస్ వైపు వెళ్లవచ్చని కూడా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వీటిపై సురేఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ఆమె భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై వస్తున్న ప్రచారాన్ని ప్రస్తుతానికి ఊహాగానంగానే చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సురేఖను తమ పార్టీలోకి రావాలని బహిరంగంగా ఆహ్వానించారు. "మీ కోసం ప్రజాశాంతి పార్టీ ఉంది.. వేరే పార్టీలోకి వెళ్లకండి" అని వీడియో సందేశంలో కోరారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీసీలు, బడుగు బలహీన వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మొత్తంగా మంత్రి పదవి నుంచి తన తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమంటూ కొండా సురేఖ నేరుగా ఆరోపించడం.. అదే సమయంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఇప్పుడు ఆమె తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నదే ఉత్కంఠగా మారింది.

# రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా



## పంజాబ్ సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు

### ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య

### ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ

### ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్

### దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు




**చండీగఢ్:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆడియోల ప్రామాణికత, వాటిలోని సంభాషణలకు ముఖ్యమంత్రి లేదా ఆయన కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం ఉందా అన్న అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### 'రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారా?'

మధ్యవర్తుల ద్వారా కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని భండారీ ఆరోపించారు. సీఎం వ్యక్తిగతంగా కేసుల విషయంలో జోక్యం చేసుకుంటున్నారా? ముఖ్యమంత్రి నివాసం కేంద్రంగా ఏమైనా ఒప్పందాలు జరుగుతున్నాయా? అంటూ ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పైనా ఆయన ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలకు స్వతంత్ర నిర్ధారణ లేదు.

### ఏమిటీ కేసు?

సామాజిక మాధ్యమ ప్రభావశీలి గుర్విందర్ సింగ్ చాహల్‌కు సంబంధించిన అత్యాచారం కేసు నేపథ్యంలో తాజా రాజకీయ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారన్న ఆరోపణలపై చాహల్‌పై కేసు నమోదైంది. ఏప్రిల్ 29న అమృత్‌సర్‌లో కేసు నమోదు కాగా, మే 1న బాధితురాలిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం అత్యాచారం ఆరోపణలను కేసులో చేర్చారు. మే 13న చాహల్‌ను అరెస్టు చేయగా.. తర్వాత ఆయన విడుదల కావడంతో దర్యాప్తు తీరుపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. బాధితురాలి తండ్రి పంజాబ్-హర్యానా హైకోర్టును ఆశ్రయించి దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో జూలై 20న గత దర్యాప్తుతో సంబంధం లేకుండా సీనియర్ పోలీసు అధికారితో విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం.

### మానవ హక్కుల కమిషన్ దృష్టికి

కేసును సెటిల్ చేసేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలు ఆగస్టులో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి వెళ్లాయి. దీనిపై విచారణ జరిపి తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను సీఎం భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ఖండించారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకునేందుకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిమ్రంజిత్ సింగ్ హుండాల్ కూడా తాను గుర్‌ప్రీత్ కౌర్‌ను ఎప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలు, మరోవైపు వాటిని సీఎం కుటుంబం ఖండిస్తున్న నేపథ్యంలో.. ఆడియో క్లిప్పుల ప్రామాణికతతో పాటు రూ.5 కోట్ల 'సెటిల్‌మెంట్' ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది.

చురకలు



# రైతు డిక్లరేషన్ హామీలేమయ్యాయి?

- 33 హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- రుణమాఫీ.. రైతుబంధులో మోసం చేశారని విమర్శ
- సాగర్ ఎడమ కాలువకు నీళ్లివ్వాలని డిమాండ్
- సెప్టెంబర్ 14లోగా షెడ్యూల్ ప్రకటించాలని అల్టిమేటం
- లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర



మిర్యాలగూడ, సెప్టెంబర్ 3: ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని హామీలు ఏమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, పంటలకు బోనస్ వంటి హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద పంటలకు నీరందించే షెడ్యూల్‌ను సెప్టెంబర్ 14లోగా ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. మిర్యాలగూడలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కేటీఆర్ మాట్లాడారు. 2022లో వరంగల్ వేదికగా ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తుచేశారు. కౌలు రైతులకూ పెట్టుబడి సాయం, వరి, పత్తికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణలో రైతుబంధును మూడు విడతల్లో ఎగ్గొట్టిందెవరని కేటీఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ, బోనస్, రైతుబీమా విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు ఇబ్బందులు పడతారని కేసీఆర్ ఎన్నికల సమయంలోనే హెచ్చరించారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండేదని, ఇప్పుడు ఎరువుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు, దళితబంధు వంటి పథకాలు నిలిచిపోతాయని కేసీఆర్ చెప్పిన మాటలు నిజమవుతున్నాయని వ్యాఖ్యానించారు. మిర్యాలగూడను 'తెలంగాణ రైస్‌బౌల్'గా తీర్చిదిద్దామని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి ప్రాంతంలో ఇప్పుడు రైతుల కోసం మహాధర్నా నిర్వహించాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. కృష్ణా జలాల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణకు రావాల్సిన నీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపుపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

### '14లోగా నీళ్లివ్వండి.. లేదంటే పాదయాత్ర'

నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 14లోగా నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. ఎప్పుడు నీరు విడుదల చేస్తారు? ఎన్ని తడులకు నీరు ఇస్తారు? ఎంత మేర అందిస్తారు? అనే వివరాలను రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. అలా చేయకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. 2003లో సాగునీటి కోసం కేసీఆర్ ఇదే మార్గంలో పాదయాత్ర చేసి అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. రైతులకు నీరందించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు




**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్‌తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్‌గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.

# సురేఖ బర్తరఫ్‌కు ఆమోదం

### సీఎం రేవంత్ సలహాకు గవర్నర్ ఆమోదముద్ర

### మంత్రి పదవి నుంచి సురేఖ తొలగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** తెలంగాణ మంత్రివర్గం నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తొలగింపు అధికారికమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహా మేరకు సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించే ప్రతిపాదనకు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. ఈ మేరకు లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చేసిన సిఫారసుకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. దీంతో సెప్టెంబర్ 3 నుంచి సురేఖ మంత్రి పదవి నుంచి వైదొలిగినట్లయింది. ఇటీవలి కాలంలో కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపాయి. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సురేఖపై చర్యలు తప్పవన్న ప్రచారం సాగింది. చివరకు ముఖ్యమంత్రి సిఫారసు చేయడం, దానికి గవర్నర్ ఆమోదం తెలపడంతో ఆమె మంత్రివర్గం నుంచి తొలగింపు అధికారికమైంది. అంతకుముందే తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై సురేఖ తీవ్రంగా స్పందించారు. తన వివరణ తీసుకోకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. అయితే తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని, పార్టీ మారే ఆలోచన లేదని స్పష్టం చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేఖ.. మంత్రి పదవి కోల్పోయినప్పటికీ శాసనసభ్యురాలిగా కొనసాగనున్నారు. తాజా పరిణామంతో కొండా సురేఖ వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో మరింత రాజకీయ చర్చకు దారితీసింది.





# బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు

### ం సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 3:** తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని



# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

### కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి

### బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 3:** తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# శంషాబాద్‌లో నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :** హైదరాబాద్ లో నకిలీ కరెన్సీని తయారు చేస్తున్న గ్యాంగ్స్ నిత్యం పెరిగిపోతున్నాయి. పోలీసులు, అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టినా ఈ ఫేక్ కరెన్సీ ముఠా ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా శంషాబాద్ లో నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్ లో చూసి నకిలీ నోట్లు తయారు చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తాజాగా అరెస్టు చేశారు. వీరిలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.2.91 లక్షల విలువ జేసే నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ప్రింటర్, స్కానర్, లామినేటర్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుటుంబం నకిలీ రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లు తయారీ చేస్తున్నారని.. ఎక్కువగా రాత్రివేళల్లోనే నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం దుకాణాలు, పాన్ డబ్బాల వద్ద నకిలీ నోట్లు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. నిందితుల్ని చింతల్ తండా, వడ్డిపట్లకు చెందిన రమావత్ రాము అలియాస్ మహ్మద్ (36), రమావత్ మోతీలాల్ (35), రమావత్ గాంధీ (19) లుగా గుర్తించారు. వీరిలో రాము ఫుడ్ డెలివరీ ఉద్యోగి కాగా మోతీలాల్ ర్యాపిడో డ్రైవర్ గా, గాంధీ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే వీరికి సహకరించిన మరో నిందితుడు నాగోల్- బండ్లగూడకు చెందిన సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక షామీర్ పేట్, బాలాపూర్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్నారన్న సమాచారంతో హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (షామీర్ పేట జోన్) పోలీసులు, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ నోట్ల తయారీ వ్యవహారం బయటపడింది. మరోవైపు నకిలీ కరెన్సీ తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా..? ఈ నోట్లు ఎక్కడెక్కడ చలామణి అయ్యాయి..? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పరారీలో ఉన్న సుధీర్ జాన్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

# మందుపాతర పేలి గిరిజనుడి మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:** ములుగు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో పాత మందుపాతర పేలి ఓ గిరిజనుడు ప్రాణాలు కోల్పోయాడు. వెదుల్లచెరువు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు (35) అనే వ్యక్తి ఈ ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే, నాగేశ్వరరావు వెదురు బొంగుల సేకరణ కోసం కర్రెగుట్టల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో గతంలో మావోయిస్టులు అమర్చినట్లుగా భావిస్తున్న మందుపాతరపై ఆయన కాలు వేయడంతో అది ఒక్కసారిగా పేలింది. ఈ పేలుడు ధాటికి నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగగా, మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. గతంలో ఈ ప్రాంతం మావోయిస్టులకు కేంద్రంగా ఉండేదని, వారు అప్పట్లో అమర్చిన మందుపాతరలు ఇంకా భూమిలో ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో కూడా ఇదే ప్రాంతంలో మందుపాతరను నిర్వీర్యం చేస్తుండగా ఓ జవాన్ గాయపడిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో, అటవీ ప్రాంతంలో అనుమానాస్పద వస్తువులు లేదా వైర్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుతం కర్రెగుట్టల పరిసరాల్లో మరిన్ని మందుపాతరలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

## సంపాదకీయం



# కూతురి రాజకీయ భవితవ్యం కోసమేనా!

### కొండా కుటుంబం చుట్టూ తెలంగాణ రాజకీయం

### సుస్మిత భవిష్యత్తుపై దంపతుల కీలక ఆలోచనలు?

### బీసీ ఆత్మగౌరవ అజెండాతో కొత్త వేదికపై చర్చ

### వరంగల్ పట్టుతో స్వతంత్ర శక్తిగా ఎదిగే యోచన?

**అధికారిక ప్రకటన లేకున్నా రాజకీయ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు**

తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం మరోసారి చర్చకు కేంద్రబిందువైంది. మంత్రి కొండా సురేఖ చుట్టూ నెలకొన్న పరిణామాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలు, కుమార్తె కొండా సుస్మిత రాజకీయ భవిష్యత్తు.. ఇవన్నీ కలిపి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తాయా? అన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా తమ కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం కొండా సురేఖ, కొండా మురళీ స్వతంత్ర రాజకీయ వేదిక వైపు అడుగులు వేస్తారా? అనే చర్చ వారి అనుచరులు, రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ దిశగా కొండా కుటుంబం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కొండా దంపతులు చాలా కాలంగా తమ కుమార్తె సుస్మిత రాజకీయ ప్రవేశంపై ఆసక్తి చూపుతున్నారన్నది వారి అనుచరుల వాదన. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలోనూ సుస్మితకు రాజకీయ అవకాశం కల్పించాలన్న ప్రయత్నాలు జరిగినట్లు చెబుతున్నారు. తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో సుస్మిత పరకాల నియోజకవర్గంపై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరిగింది. అయితే పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మరోసారి అవకాశం ఉంటుందనే సంకేతాలు రావడంతో సుస్మిత రాజకీయ భవిష్యత్తుపై కొండా కుటుంబంలో అసంతృప్తి మొదలైందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన విమర్శలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపే స్థాయికి చేరాయన్న చర్చ జరుగుతోంది.

**కూతురి కోసం రిస్క్ చేస్తున్నారా?**

సుస్మిత వ్యాఖ్యలకు తాము బాధ్యులం కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని కొండా దంపతులు చెబుతున్నారు. అదే సమయంలో ఆమె వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించకపోవడం కూడా రాజకీయంగా చర్చకు దారితీసింది. కుమార్తె రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే కొండా దంపతులు ఈ వైఖరి తీసుకున్నారనే అభిప్రాయం వారి సన్నిహిత వర్గాల్లో వినిపిస్తోంది. దశాబ్దాల రాజకీయ అనుభవం, వరంగల్ ప్రాంతంలో ఉన్న కేడర్, ప్రజల్లో పరిచయాలు, బీసీ వర్గాల్లో తమకున్న మద్దతును ఉపయోగించుకుని సుస్మితకు ప్రత్యేక రాజకీయ వేదిక సిద్ధం చేయాలన్న ఆలోచన కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం బీసీ ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై సమాలోచనలు జరుగుతున్నట్లు వారి మద్దతుదారులు చెబుతున్నారు.

**బీసీ జెండాతో కొత్త పార్టీ?**

రాష్ట్రంలో బీసీ వర్గాలను ఒకే రాజకీయ వేదికపైకి తీసుకురావాలన్న ఆలోచన కొండా దంపతుల ముందున్న ప్రత్యామ్నాయాల్లో ఒకటిగా ప్రచారంలో ఉంది. ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక అసంతృప్తితో ఉన్న బీసీ నేతలను ఆకర్షించడం ద్వారా కొత్త రాజకీయ శక్తిని నిర్మించవచ్చనే లెక్కలు వేస్తున్నట్లు వారి సన్నిహిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో టికెట్లు దక్కని నేతలు, రాజకీయంగా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వారిని ఒక వేదికపైకి తీసుకురావచ్చన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. కొత్త రాజకీయ వేదిక ఏర్పడితే నేరుగా ప్రజల్లోకి వెళ్లేందుకు రాష్ట్రవ్యాప్త పర్యటన లేదా పాదయాత్ర వంటి కార్యక్రమాలపైనా ఆలోచనలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అంతా ప్రచారమేనా?.. అడుగు పడుతుందా?**

కొండా దంపతులకు సుదీర్ఘ రాజకీయ అనుభవం, వరంగల్ ప్రాంతంలో కేడర్ ఉన్నప్పటికీ కొత్త పార్టీ ఏర్పాటు అంత సులభమైన వ్యవహారం కాదన్న అభిప్రాయమూ రాజకీయ వర్గాల్లో ఉంది. బీసీ వర్గాలను ఒకే రాజకీయ గొడుగు కిందకు తీసుకురావడం ఎంతవరకు సాధ్యమవుతుంది? కొండా కుటుంబం వెంట ఇతర పార్టీల నేతలు ఎంతమంది నడుస్తారు? కొత్త వేదికకు రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటికైతే సమాధానం లేదు. మరోవైపు తాజా పరిణామాలన్నీ కూతురు సుస్మిత రాజకీయ భవిష్యత్తును సుస్థిరం చేసేందుకేనా? లేక కాంగ్రెస్‌లో తమ రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడుకునేందుకు కొండా దంపతులు ఒత్తిడి పెంచుతున్నారా? అన్న చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం మాత్రం కొండా కుటుంబం తీసుకోబోయే తదుపరి నిర్ణయంపైనే అందరి చూపు నిలిచింది. కొత్త రాజకీయ పార్టీ నిజంగానే రూపుదిద్దుకుంటుందా?.. బీసీ ఆత్మగౌరవ నినాదంతో కొత్త వేదిక వస్తుందా?.. లేక కాంగ్రెస్‌లోనే రాజీ కుదురుతుందా?.. అన్నది కొండా దంపతుల అధికారిక ప్రకటనతోనే తేలనుంది.



# ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు

- అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీలో వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3:** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# 91 ఏళ్ల వయసు.. వరదతో ఒంటరి పోరాటం!

### రెండు గంటలకు పైగా బురద నీటిలోనే

### జేసీబీ సాయంతో సురక్షితంగా వెలికితీత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** చుట్టూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద.. మెడ వరకు బురద నీరు.. కదలలేని పరిస్థితి.. సాయం కోసం ఎదురుచూపులు. అయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. 91 ఏళ్ల వయసులోనూ ప్రాణాలను కాపాడుకునేందుకు గంటల తరబడి పోరాడారు. నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరదల్లో గుణ మాయ బోహరా చూపిన అసాధారణ ధైర్యం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నువాకోట్‌లోని దేవీఘాట్‌లో ఉన్న 'సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్' వృద్ధాశ్రమాన్ని ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. ఆశ్రమవాసులు అల్పాహారం తీసుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వరద నీరు లోపలికి దూసుకొచ్చింది. ప్రమాదాన్ని గుర్తించిన పలువురు పై అంతస్తులకు పరుగులు తీశారు. మరికొందరు మాత్రం వరద ఉద్ధృతిలో చిక్కుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు వృద్ధులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. కింది అంతస్తులోని గదిలో ఉన్న గుణ మాయ బోహరా వరదలో చిక్కుకున్నారు. కాళ్లకు సంబంధించిన సమస్యల కారణంగా వేగంగా కదలలేని పరిస్థితి ఉన్నప్పటికీ ఆమె ధైర్యం కోల్పోలేదు. గదిలోకి బురద నీరు వేగంగా చేరుతున్న సమయంలో కిటికీ తలుపులు తెరిచి, తలను నీటిపై ఉంచేందుకు ప్రయత్నిస్తూ దాదాపు రెండు నుంచి మూడు గంటలపాటు ప్రాణాలను నిలుపుకున్నట్లు సమాచారం. చివరకు స్థానిక సహాయక బృందాలు ఆమెను గుర్తించాయి. జేసీబీ సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. జేసీబీ స్కూప్‌లో కూర్చున్న గుణ మాయ చిత్రం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. వరద బీభత్సం మధ్య ఆమె చూపిన ధైర్యం, మొక్కవోని సంకల్పానికి ఆ చిత్రం ప్రతీకగా నిలుస్తోంది. అనంతరం గుణ మాయతో పాటు రక్షించిన ఇతరులను ఖాట్మండులో ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరానికి తరలించారు. అక్కడ వారికి ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు సమాచారం. నేపాల్‌లో వరదల కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై వివిధ గణాంకాలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో అధికారికంగా ధ్రువీకరించిన తాజా వివరాలే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంది. వరదలు ఎంతటి విధ్వంసాన్ని సృష్టించినా.. 91 ఏళ్ల గుణ మాయ బోహరా సాగించిన ప్రాణపోరాటం మాత్రం విపత్తు మధ్య మనిషి సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.



# ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదు

### బీఎస్పీ పార్టీ అధినేత్రి మాయావతి




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి. అప్పటివరకు ఆయనకు ముఖ్యమైన పార్టీ బాధ్యతలు అప్పగించడం సముచితం కాదు" అని మాయావతి పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావడంపై దృష్టి పెట్టాలని ఆమె పార్టీ నేతలకు సూచించారు. ప్రత్యర్థులు లంచాలు, బెదిరింపులు, వివక్ష వంటి మార్గాలతో బీఎస్పీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాయావతి వ్యాఖ్యల తర్వాత ఆకాశ్ ఆనంద్ తన 'ఎక్స్' ప్రొఫైల్‌ను కూడా మార్చారు. గతంలో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇప్పుడు తన ప్రొఫైల్‌లో 'బీఎస్పీ కార్యకర్త'గా పేర్కొన్నారు. దీంతో ఆయన మద్దతుదారుల్లో నిరాశ వ్యక్తమైంది. ఆకాశ్ ఆనంద్‌ను 2025 ఆగస్టులో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా నియమించారు. దీంతో ఆయన మాయావతి తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదుగుతున్నారనే అంచనాలు ఏర్పడ్డాయి. యువతను బీఎస్పీ వైపు తీసుకురావడంతో పాటు యూపీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో మాయావతి ప్రకటించారు. తాజా పరిణామాలతో ఆ అంచనాలపై అనిశ్చితి నెలకొంది.

# రామ మందిర్ సీఈవో నియామకంపై రాజకీయం

### కాంగ్రెస్ అనుమానాలు..

### బీజేపీ ఘాటు ప్రత్యుత్తరం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణాధికారి)గా భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. సైనిక అధికారికి రామ మందిర ట్రస్ట్ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయగా, బీజేపీ సైతం అంతే ఘాటుగా ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ సీనియర్ నేత రషీద్ అల్వీ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులకు గవర్నర్లు, రాజ్యసభ సభ్యత్వాలు కట్టబెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు రిటైర్డ్ ఎయిర్ మార్షల్‌ను టెంపుల్ ట్రస్ట్ సీఈఓగా ఎలా నియమిస్తుందని ప్రశ్నించారు. గతంలో సైనిక చర్యగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' వెనుక ఉన్న నిగూఢమైన రహస్యాలను దాచిపెట్టేందుకే జితేంద్ర మిశ్రాకు ఈ పదవిని రివార్డుగా ఇచ్చారా అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మందిరంలో గతంలో జరిగినట్టు చెబుతున్న అక్రమాలు, నిధుల వ్యవహారాలపై పూర్తి విచారణ జరిపి బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయలేదని, మోదీ ప్రభుత్వ విధానాలు దేశానికి చేటు తెస్తున్నాయని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు సనాతన ధర్మంతో పాటు భారత సైనిక దళాలపై గౌరవం లేదని, దేవుడిని, సైనికులను అవమానించడమే వారి నైజమని మండిపడ్డారు. దేశం కోసం పోరాడిన సైనిక అధికారి సేవలను మందిర పారదర్శక పరిపాలన కోసం ఉపయోగించుకుంటే ఓర్వలేకపోతున్నారని బీజేపీ నాయకులు తిప్పికొట్టారు.



చురకలు



# అంబిటాస్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## ఉట్టికొట్టి అలరించిన చిన్నారులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని అంబిటాస్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. రంగురంగుల వస్త్రాలు ధరించి కృష్ణుడు, గోపికలుగా ముస్తాబైన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి సందడి, కేరింతలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, ఉత్సాహభరితమైన వేడుకలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చిన్నారులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

# వెయ్యి రోజుల పాలనకు కాంగ్రెస్ శ్రేణుల బైక్ ర్యాలీ

**సదాశివపేట, సెప్టెంబర్ 03, :**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశాలతో, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి నాయకత్వంలో కార్యక్రమం చేపట్టారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్‌లపై ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. పలుచోట్ల బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్లు కోవూరు శంకర్‌గౌడ్, నర్సింలు, షేడ్జి, దుబాయ్ వాజిద్, అనిత, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రియాంక పవన్, గౌరీదేవి తుల్జారాం, లక్ష్మీప్రియ భరత్, కోఆప్షన్ సభ్యులు రైమత్, వాజిద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, మాజీ కౌన్సిలర్లు గుండు రవి, రాయపాటి రమేష్, శ్రీనివాస్, రాష్ట్ర బీసీ డైరెక్టర్ పట్నం సుభాష్, కాంగ్రెస్ నాయకులు కోడూరు శరత్‌చంద్ర, సాబీర్, విజయ్, తుకారం, కళ్యాణ్‌రాజ్, బాబు, సోమశేఖర్, ప్రశాంత్‌గౌడ్, కిరణ్, మధు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్‌కు శంకుస్థాపన

- రూ.18 లక్షల నిధులతో నిర్మాణం.. హర్షం వ్యక్తం చేసిన కాలనీ వాసులు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 03, :** 291వ డివిజన్ షాపూర్‌నగర్ పరిధిలోని కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి రూ.18 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. కళావతి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ హాల్ అందుబాటులోకి వస్తే వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాలకృష్ణ, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ సెక్రటరీ సంతోష్, గాదె వినోద్, కాలనీ సీనియర్ నాయకులు రజితా రత్నం, రజాక్, కృష్ణ, బుచ్చయ్యపతి, అచ్చమ్మ, నరసమ్మ, సంపంగి వెంకటేష్, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్టీ లేకుండా చెట్ల కొమ్మల తొలగింపు

- భారత్‌నగర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రమాదాల అంచున మున్సిపల్ సిబ్బంది పనితీరు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సిద్దిపేట జిల్లా కేంద్రం భారత్‌నగర్‌లోని రమేష్ బొమ్మ సమీపంలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది కనీస భద్రతా చర్యలు పాటించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా పనులు చేపడుతున్నప్పటికీ, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు, బారికేడ్లు, రక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. చెట్ల కొమ్మలు కొట్టివేసే సమయంలో అవి రహదారిపై పడే అవకాశం ఉండటంతోపాటు, అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. అయినప్పటికీ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే భద్రతా చర్యలు చేపట్టి పనులు నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. పనులు చేపట్టే ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, బారికేడ్లు పెట్టడం, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గం చూపించడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు తావులే కుండా చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిర్వహించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ఇప్పటికైనా అధికా రులు స్పందించి, భద్రతా ప్రమాణాలు పాటించకుండా జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# చిన్ని కృష్ణుల సందడి.. పండుగ శోభ..

- కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు..




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌లో గల శ్రీవాణి స్కూల్లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా 120 మందికి పైగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, చిన్ని కృష్ణుడి సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్ సత్యం మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పండుగల ద్వారా చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత సృష్టికర్త శ్రీకృష్ణుని బోధనలు మానవాళికి మార్గదర్శకం

- జన్మాష్టమి సందర్భంగా కృష్ణాష్టమి కాన్వాస్ చిత్రాన్ని ఆవిష్కరించిన అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో గురువారం కృష్ణాష్టమి కాన్వాస్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కళావంతం చేస్తాయని రుస్తుం అన్నారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే జన్మాష్టమి భారతీయులు జరుపుకునే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని బోధనలే భగవద్గీతకు సారమని, ఆ బోధనలను ఆచరిస్తే ప్రపంచంలో కొట్లాటలకు తావుండదన్నారు. స్వార్థం, గర్వం, అహంకారం మనిషిని ఉన్మాదం వైపు నడిపించి దుర్మార్గునిగా మారుస్తాయని భగవద్గీత హెచ్చరిస్తోందని తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు ప్రతి ఒక్కరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఐకమత్యంగా, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ జీవించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో నిలిచి, భారతదేశం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలవాలని మానవతా చిత్రకారుడు రుస్తుం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనా రుస్తుం, మొహ్మద్ సాధిక్, ఎండీ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.15 లక్షల ప్రమాద బీమా



**దమ్మపేట, సెప్టెంబర్ 03, :** దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా సంవత్సరానికి రూ. 755/- ప్రీమియంతో రూ. 15 లక్షల ప్రమాద బీమా చేయించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ చేస్తున్న పోస్టల్ సిబ్బంది మాట్లాడుతూ 18 నుండి 66 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవడానికి అర్హులు అన్నారు, ప్రమాదవశాత్తు మరణం లేక శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే రూ. 15 లక్షలు నామినీకి అందుతాయి అని, పాలసీదారు మరణిస్తే పిల్లల చదువులకు రూ. 1 లక్ష, పెళ్లి కోసం మరో రూ. 1 లక్ష, ఆసుపత్రిలో చికిత్స కోసం రూ. 1 లక్ష వరకు క్లెయిమ్ చేసుకోవచ్చు అని, ఐసీయూలో ఉంటే రోజుకు రూ. 2,000, సాధారణ గదికి రోజుకు రూ. 1,000 ఇస్తారు అన్నారు. చేయి లేదా కాలు విరిగితే రూ. 25,000 లభిస్తాయి అన్నారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం అదనంగా రూ. 30,000 వరకు వస్తాయి అన్నారు. ఇన్సూరెన్స్ చేయిస్తున్నందుకు పంచాయతీ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, సిబ్బంది రాఘవులు, అన్నవరం, రామకృష్ణ, రాంబాబు, నాగు, బసవయ్య తదితరులు ఉన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనకు ప్రజల హర్షం


## కుత్బుల్లాపూర్‌లో ఘనంగా బైక్ ర్యాలీ



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. గిరినగర్ డివిజన్‌లోని డీ-మార్ట్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కనకరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాం, గిరినగర్ డివిజన్ అధ్యక్షుడు జలీల్ ఖాన్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిమి రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కార్యం ప్రకాష్, మైనారిటీ అధ్యక్షుడు అజర్, సీనియర్ నాయకులు మురళీ, భాస్కర్, వెంకటేష్, సయ్యద్ రషీద్, మహిళా అధ్యక్షురాలు మాధవి రాణి, చిన్నమ్మ, నీల గుప్త, లక్ష్మీరెడ్డి, లక్ష్మి, భాగ్య తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సిద్దిపేట కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు సెప్టెంబర్ 5 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 20 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫాస్లీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ముందుగా సంబంధిత ఏసీపీ అధికారుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. బందల పేరిట వివిధ కారణాలను చూపుతూ సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయాలని ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో భారీ శబ్దాలతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు విధించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ ఉత్తర్వులు సెప్టెంబర్ 5 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 20 ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ అధికారుల అనుమతి పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజే సౌండ్ వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 223 బీఎన్ఎస్, సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లీ సెక్షన్ 76, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 తదితర నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# తొగుట మండల స్థాయి ఎస్జిఎఫ్ క్రీడా పోటీలు విజయవంతం

- రెండు రోజుల పాటు సాగిన పోటీలు
- ప్రతిభ చాటిన సీనియర్, జూనియర్ విద్యార్థులు

**తొగుట, సెప్టెంబర్ 03, :** తొగుట మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విజయవంతంగా ముగిశాయి. సెప్టెంబర్ 2, 3 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడలలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సీనియర్, జూనియర్ విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. మండల విద్యాశాఖ అధికారి నరసయ్య, గుడికందుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు క్రీడల నిర్వహణకు నిరంతరం సహకరించిన గుడికందుల సర్పంచ్ కన్నయ్యగారి లక్ష్మి , పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణ



రెడ్డి, విభీషణ్ రెడ్డి, పెద్ద మాసాన్ పల్లి సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, తొగుట సర్పంచ్ శోభా కొండల్ రెడ్డి, మెట్ల రవీందర్ రెడ్డిలకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# యూరియా యాప్ రద్దు చేయాలి

## దుబ్బాకలో రైతుల రాస్తారోకో

**దుబ్బాక, సెప్టెంబర్ 03, :** యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, యూరియా బుకింగ్ యాప్ ను వెంటనే తొలగించాలంటూ గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. నెల రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి వెళితే యూరియా లేదని చెబుతున్నారని వాపోయారు. దీంతో



ఆగ్రహించిన రైతులు పట్టణంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను మూసి వేయించారు. చదువు రాక, ఆండ్రాయిడ్ ఫోన్లు లేక యాప్ లో యూరియా బుక్ చేసుకోలేక పోతున్నామని రైతులు తెలిపారు. యూరియా వచ్చిందని తెలిసిన నిమిషంలోనే యాప్ లో స్టాక్ అయిపోయిందని చూపిస్తోందని, దళారులే యూరియాను బుక్ చేసుకుని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి రైతులకు నేరుగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సెల్ ఫోన్లు చూపిస్తూ రైతులు నిరసన తెలిపారు. సకాలంలో యూరియా అందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, భూపాల్ పలువురు పాల్గొన్నారు.

# పేదల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరుబాట

- 2బీహెచ్‌కే ఇళ్ల కేటాయింపు, 22ఏ సమస్యల పరిష్కారం కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్–గండిమైసమ్మ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ ధర్నా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ప్రధానంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. భూ సమస్యల కారణంగా అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మండల తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి, 2బీహెచ్‌కే ఇళ్ల కేటాయింపు, 22ఏ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని



హెచ్చరించారు. పేదల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 49 భూమిపై తప్పుడు వార్తలు

## వాస్తవాలు ఇవే.. జిల్లా కలెక్టర్..

**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 03, :** గజ్వేల్ మండలం హవాయిగూడ గ్రామంలోని సర్వే నంబర్ 49 భూమికి సంబంధించి ఈనాడు, నమస్తే తెలంగాణ పత్రికల్లో ప్రచురితమైన వార్తలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి గురువారం స్థానిక మీడియాకు తెలిపారు. సర్వే నంబర్ 49లో మొత్తం 83.04 గుంటల భూమి ఉందని 1959-60 పహాణీ ప్రకారం ఇందులో 31.27 గుంటలు ప్రభుత్వ భూమి (గైరాన్)గా, 51.17 గుంటలు పట్టా భూమిగా నమోదయ్యాయని తెలిపారు. పట్టా భూమికి రఘుపతిరావు, నర్సయ్య పేర్లు పట్టాదారులుగా ఉన్నాయని, సప్లిమెంటరీ సేత్వార్ ఉత్తర్వుల ద్వారా సర్వే నంబర్ 49/1లోని 31.27 గుంటలు ప్రభుత్వ భూమిగా, మిగిలిన 51.17 గుంటలు పట్టా భూమిగా నిర్ధారించారని, అనంతరం ప్రభుత్వ భూమిని 37 మందికి అసైన్ చేయగా, సర్వే విభాగం సబ్‌డివిజన్ రికార్డులు కూడా రూపొందించిందని తెలిపారు. 1959-60 నుంచి



2010-11 వరకు పహాణీలను పరిశీలించినా, ప్రభుత్వ భూమి 37 మంది అసైనీల పేర్లతో, పట్టా భూమి రఘుపతిరావు, నర్సయ్య లేదా వారి వారసుల పేర్లతోనే నమోదై ఉందని కలెక్టర్ వివరించారు. ధరణి పోర్టల్‌లో నమోదుల సమయంలో పట్టా భూమి వర్గీకరణను పొరపాటున అసైన్ భూమిగా నమోదు చేశారని, భూభారతి పోర్టల్‌లోనూ అదే నమోదు కొనసాగిందని, ఈ తప్పును సరిచేయాలని పట్టాదారులు దరఖాస్తు చేసుకోగా, రెవెన్యూ రికార్డులను పరిశీలించిన అనంతరం గజ్వేల్ తహశీల్దార్, ఆర్డీవో సిఫారసుల మేరకు జిల్లా కలెక్టర్ భూమి వర్గీకరణ మార్పునకు మాత్రమే ఆమోదం తెలిపారు. అసైనీలు, పట్టాదారులు లేదా వారి వారసుల పేర్లలో ఎలాంటి మార్పులు చేయలేదని, కేవలం భూభారతి పోర్టల్‌లో తప్పుగా నమోదైన భూమి వర్గీకరణను మాత్రమే సరిచేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. అందువల్ల అసైన్ భూమిని పట్టా భూమిగా మార్చినట్లు, 52 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతరులకు పంచినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా కల్పితం, నిరాధారం, సత్యదూరమని జిల్లా కలెక్టర్ ఖండించారు. వాస్తవాలను పరిశీలించి వార్తలు ప్రచురించాలని కలెక్టర్ హైమావతి సున్నితంగా కోరారు.

# వీధి వ్యాపారులు లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## దుబ్బాక మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారత, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం స్వనిధిలోని లోక్ కళ్యాణ్ మేళ పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలతో లోక్ కళ్యాణ్ మేళాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వీధి వ్యాపారుల వ్యాపార ప్రయోజనాన్ని బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలను మెప్మా ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలో ఈ విడతలో 131 మంది వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మెప్మా ఆర్పీలు వీధి వ్యాపారులను గుర్తించి అర్హులకు రుణాలు అందించేలా కృషి చేయాలని సూచించారు. రోజువారీ వ్యాపార విస్తరణకు ఈ సూక్ష్మ రుణాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మెప్మా సీవో రేణుక, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**మిరుదొడ్డి, సెప్టెంబర్ 03, :** దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో ఉట్టి ఏర్పాటు చేయగా, కృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉట్టిని పగలగొట్టారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం సంతరించుకుంది. పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియ జేసేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ తెలిపారు. ప్రతి విద్యార్థికి సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు సమాజంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన, సౌకర్యాలు అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- చిన్నారుల శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణ..

## ఉట్టి కొట్టి సందడి




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని త్రివేణి పాఠశాల చింతల్ బ్రాంచ్‌లో గురువారం వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. చిన్నారి విద్యార్థుల సందడి, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో చింతల్ బ్రాంచ్ కిడ్స్ ప్రిన్సిపల్ నళిని, సీఎస్ఓ సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్రావు, క్యాంపస్ ఇన్‌చార్జి హిమం క్రాంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టి ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ పండుగల సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చిన్నారుల్లో ఆనందంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచాయని పేర్కొన్నారు.

# కృషి హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి కోలాహలం..

- రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు సందడి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సూరారం కాలనీలోని కృషి హైస్కూల్‌లో కరస్పాండెంట్ పోరంకి శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే గండిమైసమ్మ కృషి హై స్కూల్ బ్రాంచ్-3లో ప్రిన్సిపల్ నదియా ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను ప్రతిబింబించే కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను అభినందించారు. విద్యతో పాటు సాంస్కృతిక విలువలను అలవర్చుకోవాలని, విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు 'బెల్టు' తీసేయండి

- లైసెన్స్ షాపులో క్వార్టర్ రూ.180
- బెల్ట్ షాపులో రూ.230
- మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అనధికారిక బెల్ట్ షాపుల ద్వారా సాగిస్తున్న దోపిడీని ఆపాలంటూ దమ్మపేట గ్రామస్తుల విజ్ఞప్తి







**దమ్మపేట, సెప్టెంబర్ 03, :** దమ్మపేట మండల కేంద్రంలో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఒక బడి లేదు, గుడి లేదు అంతటా బెల్ట్ షాపులే కనిపిస్తున్నాయి. దమ్మపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులే ఈ వ్యవహారంపై సోమవారం ప్రజా వాణిలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చినటువంటి సందర్భం ఉంది. కంప్లైంట్ పెట్టిన తెల్లారే ఎక్సైజ్ వారు నామమాత్రంగా వచ్చి ఏదో బెల్టు షాపుల్ని మూయిస్తున్నట్లు సామాన్యులను ఉద్ధరిస్తున్నట్లు నటించి వెళ్ళారు. యదావిధిగా మద్యం అమ్ముతున్నారు. దమ్మపేట మండల కేంద్రంలో ఐదు లైసెన్స్ షాపులు ఉన్నాయి. ఇవి చాలవు అన్నట్లు సామాన్య ప్రజలు ఎక్కువ త్రాగే బ్రాండ్లను లైసెన్స్ మద్యం షాపుల్లో అమ్మకుండా బెల్ట్ షాపులకి తరలించి సామాన్య ప్రజలు త్రాగేటటువంటి బాటిళ్ళను అధిక రెట్లకి అమ్ముతూ వారి కష్టపడ్డ డబ్బులను దోచుకుంటున్నారు. వాస్తవంలోకి వెళితే రోజువారి కూలి పనులకు వెళ్ళేవారు ఓల్డ్ అడ్మిరల్ బ్రాండ్ మాత్రమే తాగుతారు ఆ బాటిల్ బ్రాందీ షాపులో దొరకదు బెల్ట్ షాప్ లోనే దొరుకుతుంది. దీని ధర కేవలం 160 రూపాయలు మాత్రమే బయట బెల్ట్ షాపుల వారికి ఇచ్చి 190 రూపాయలు వారి వద్ద నుండి గుంజుకొని వారి రక్తాన్ని తాగుతున్నారు. అలాగే సామాన్య మానవులు త్రాగేటటువంటి మాన్షన్ హౌస్, ఎంసీ డైట్ వంటి బాటిల్లు బెల్ట్ షాపులు తప్ప లైసెన్స్ షాపులలో ఉండవు. ఈ బాటిల్ 180 రూపాయలు మాత్రమే వీటి ఖరీదు. వీరు బెల్టు షాపులు వద్ద 230 రూపాయలకు విక్రయించి సామాన్యులను దోచుకుంటున్నారు. ఇవన్నీ ఎక్సైజ్ వారికి తెలియదా.. దమ్మపేట మండలంలో ఉన్న గెజిటెడ్ అధికారులకు తెలియదా.. ఎవరికి తెలియదు అంటే వీరిని ఏమనాలి ఏమని వర్ణించాలి. సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా అధిక ధరలకు విక్రయిస్తూ ఒక్క దమ్మపేట గ్రామంలోని సుమారు 100 బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ఎక్కడబడితే అక్కడ కూరగాయల అమ్మినట్లు మైనర్లను కూడా మందుకు బానిసలను చేస్తూ వారి భవిష్యత్తును నాశనం చేస్తున్న ఎక్సైజ్ శాఖ వారిని ఏమనాలి. ఒక్కసారి ఆలోచించండి, ఎక్కడపడితే అక్కడ మద్యం దొరకకపోతే మైనర్లు వెళ్ళి కొనే ప్రసక్తి ఉండదు. అలాగే గవర్నమెంట్ వారు కేటాయించినటువంటి ధరలకే ఓల్డ్ అడ్మిరల్, మాన్షన్ హౌస్, ఎంసీ డైట్ ఈ మూడు బ్రాండులు కూడా లైసెన్స్ మద్యం షాపుల కౌంటర్లో విక్రయించాలని, లైసెన్స్ మద్యం షాపులలో లేని బ్రాండులు బెల్ట్ షాపులలో ఎలా వస్తున్నాయని, బెల్ట్ షాపులలో కల్తీ జరిగి బయట నుండి తెప్పించి మద్యం అమ్మితే దానికి పూర్తి బాధ్యత ఎక్సైజ్ శాఖ వారే బాధ్యత వహించాలని దమ్మపేట గ్రామ ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సిద్దిపేట పట్టణంలోని శ్రీ నిఖిలేశ్వరానంద హైస్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, వారి చిలిపి చేష్టలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పాల ఉట్టి కార్యక్రమంలో పాల్గొని కృష్ణాష్టమి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జీవరత్నం, ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి, తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పండుగల ప్రాముఖ్యతను, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని వారు తెలిపారు.

# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ భారీ ధర్నా

- 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: వీరారెడ్డి నరేందర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 3, :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వరుస నిరసనల్లో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మార్వో అధికారికి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో జీడిమెట్ల 132వ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలని, అర్హత కలిగిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, 22-ఏ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లు కేటాయించాలని, అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజల తరపున మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.



# తులిప్స్ స్కూల్లో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడు-గోపికల వేషధారణతో ఆకట్టుకున్న విద్యార్థులు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సిద్దిపేట నియోజకవర్గంలోని ఎన్సాన్ పల్లిలో గల తులిప్స్ స్కూల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా, సందేశాత్మకంగా సాగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నాగ లత కోటేశ్వర్, ప్రిన్సిపల్ మిద్దె ప్రశంస, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు వీటి ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, విజ్ఞానం పెరుగుతుందని స్పష్టం చేశారు. స్కూల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కలుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరికొకరు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగరాణి, అనూష, తార, స్వప్న, సుస్మిత, నందిత ,రవళి, శ్రావణి, పవిత్ర, భవాని ,లావణ్య, అనురాధ, పావని , విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ దినోత్సవానికి నిధులు మంజూరు



సంగారెడ్డి డీఈఓ రోహిణి

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సంగారెడ్డి జిల్లాలో ఈనెల 5వ తేదీన నిర్వహించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ నిధులు మంజూరు చేసిందని డీఈఓ రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమానికి రూ.15,000, 29 మండలాలకు రూ.1.45 లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్క మండలానికి రూ.5.000 వేలచొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఎంఈఓలకు నోటీసులు అందజేశారు. పిఆర్టియు సంఘం ఎన్నికల్లో అనుకూలంగా వ్యవహరించినందుకు ముగ్గురు ఎంఈఓలకు డీఈవో రోహిణి నోటీసులు జారీ చేశారు. నారాయణఖేడ్ విశ్వనాథ్, మనూరు రాజశేఖర్, నాగలి గిద్ద మన్మధ కిషోర్ కు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఎంఈఓలు ఎవరు కూడా ఉపాధ్యాయ సంఘాల ఎన్నికల్లో పాల్గొన వద్దని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకు వరం



- సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేసిన అనిల్ రెడ్డి

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకి వరం అని, అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి సూచించారు. వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన ఎల్క మల్లేశం గత 6 నెలల క్రితం అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందగా గురువారం ఎల్క మల్లేశంకి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60 వేల చెక్కును అనిల్ రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ముఖ్యంగా రైతులు, విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్గల్ మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మట్ట సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు నందకుమార్, రాజు, నితిన్ రెడ్డి, నర్సింలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యానికేతన్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గిరినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల గ్రౌండ్స్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ కట్టే శ్రీకాంత్ యాదవ్ పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అవినీతి అభివృద్ధిపై అసెంబ్లీలో తేల్చుకుందాం రండి

- బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావులకు మంత్రి అడ్లూరి సవాల్
- ఉనికి కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నం
- వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ కొప్పుల ఈశ్వర్ కి పంపిస్తా
- ప్రోగ్రెస్ రిపోర్టులో తప్పులుంటే దేనికైనా సిద్ధం
- విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్..



**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 03, :** వెయ్యి రోజుల ప్రజాపాలన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తీసుకురావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ లో రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ యాస భాషతో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీని ఏక వచనంతో సంబోధించడం కేటీఆర్ హరీష్ రావుల అహంకారానికి నిదర్శనమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మరో రెండు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఉచిత విద్యుత్తు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ళను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో పేపర్ లీకేజీలు, నోటిఫికేషన్లకే పరిమితమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులతో పాటు ధర్మపురి దేవుడికి సైతం శఠగోపం పెట్టారని మంత్రి గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు వేములవాడ కొండగట్టు పుణ్యక్షేత్రాలను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నరని మంత్రి గుర్తు చేశారు.

### మాజీ మంత్రి కొప్పులకు వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్

2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ధర్మపురి ప్రజలు తనకు పట్టం కట్టారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ధర్మపురి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఏనాడు ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కి పంపిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తాను పంపిస్తున్న ప్రోగ్రెస్ రిపోర్టులో ఎలాంటి తప్పులు ఉన్న దేనికైనా సిద్ధమేనని మంత్రి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎల్లంపల్లి భూ నిర్వాసితుల పక్షాన నిలిచి రూ. 17 కోట్లు ప్రభుత్వం ద్వారా విడుదల చేయించానని మంత్రి తెలిపారు. ధర్మపురి లో డిగ్రీ కళాశాల అనుమతి తీసుకురావడంతో పాటు కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభమై విద్యార్థులకు డిగ్రీ కళాశాల అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ధర్మారం మండలంలో ఐటిఐ ఏర్పాటు చేస్తున్నామని రూ. 10 కోట్లతో ధర్మపురి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ధర్మపురిలో గోదావరి నది కలుషితం కాకుండా రూ. 17 కోట్లతో సివరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని మంత్రి అడ్లూరి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మధ్యలోనే నిలిచిపోయిన రోళ్ళ వాగు ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించి ధర్మపురి నియోజకవర్గంలోని రైతులకు శాశ్వత సాగునీటి పరిష్కారం సూచిస్తామని మంత్రి తెలిపారు. గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి చెరువు పూడికతీత పనులు చేయడంతో పాటు యశ్వంతరావుపేట చెరువును అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురిలో నైట్ కళాశాల ప్రారంభించడంతో పాటు నేరెళ్లలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో వివిధ నిధుల ద్వారా రూ. 141 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ధర్మపురిలో ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురిలో శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇందులో భాగంగా అమృత పథకం ద్వారా రెండు నూతన నీళ్ల ట్యాంకులను నిర్మించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ డివిజన్ సాధించడంతో పాటు బస్ డిపో ఏర్పాటు చేస్తామని అదేవిధంగా సబ్ ట్రెజరీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి వివరించారు. కొప్పుల ఈశ్వర్ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఏనాడు సంక్షేమ శాఖను పట్టించుకోలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ లో ఉన్న బిల్లుల చెల్లించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కొప్పుల మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని 411 కుల సంఘాల భవనాలకు ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని మంత్రి ఆరోపించారు. తాను ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో పనిచేస్తున్న పోలీసు అధికారుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాజీ మంత్రి కొప్పుల మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారని తనపై సైతం 17 కేసులు నమోదు చేయడంతో పాటు పలు సందర్భాల్లో గతంలో పని చేసిన పోలీసులు మ్యాన్ హ్యాండిలింగ్ చేశారని మంత్రి గుర్తు చేశారు. కొప్పుల ఈశ్వర్ పోలీసులను బెదిరించే ఆలోచన మానుకోవాలని మంత్రి అడ్లూరి అన్నారు. రెండేళ్లుగా ధర్మపురి నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల పై ఒక్క అక్రమ కేసు నమోదు కాలేదని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికి కాపాడుకోవడానికి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని రానున్న రోజుల్లో రెండవసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి అవుతారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సాగౌడ్, వెల్గటూర్ మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, పెగడపల్లి మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా కాంగ్రెస్ విజయోజత్సవ సభలు, ర్యాలీలు

**మానకొండూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు, ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశం మేరకు మానకొండూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీశ్రేణులు సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ ర్యాలీల్లో వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### మానకొండూర్ లో

మానకొండూర్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. గత ప్రభుత్వం సుధీర్ఘ కాలం పాలించినప్పటికీ భారీ గా అప్పులు మిగిల్చిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తక్కువ సమయంలోనే పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, రైతు రుణమాఫీ, రైతు భరోసా,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భీమా,రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తూ ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతోందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనపై ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మబోరని ఆయన స్పష్టం చేశారు.

### శంకరపట్నంలో

కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేశవపట్నం అంబేద్కర్ కూడలి వద్ద భారీ ర్యాలీ, విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభయహస్తం – ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తూ పేదలు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు,సామాన్య ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ప్రతి గ్రామం, బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని,అలాగే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తోందని,రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని,వెయ్యి రోజుల్లో 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. దీనిపై గ్రామాలకు వెళ్లి చర్చ చేసేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు.

### తిమ్మాపూర్ లో

తిమ్మాపూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండారి రమేశ్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలకు నోచుకోని ప్రజలు కాంగ్రెస్ ప్రజాపాలనలో లబ్ధిపొందుతుంటే గిట్టని గులాబీ పార్టీ నాయకులు కాంగ్రెస్ పాలనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఏమీ చేయని కారణంగానే ప్రజలు ఎన్నికల్లో బీఆర్ఎస్ బుద్ధిచెప్పారన్నారు.

### బెజ్జంకిలో

బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన చారిత్రక మైలు రాయిగా నిలిచిందని పేర్కొంటూ కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ బెజ్జంకి పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి ఎడ్ల బండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

### ఇల్లంతకుంటలో

ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డిఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పబ్బం గడుపుకునేందుకే కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. పథకాల అమలుతో లబ్ధిపొందుతున్న ప్రజలు ప్రభుత్వంపై ఆదరణ చూపడాన్ని జీర్ణించుకోలేకని ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలును ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పాక్స్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విస్డం విద్య భారతి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 03, :** కొడిమ్యాల మండల కేంద్రంలోని విస్డం విద్యా భారతి విద్యాసంస్థలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారి విద్యార్థిని విద్యార్థులు గోపిక శ్రీకృష్ణ వేషధారణలతో వచ్చి అందరిని ఎంతగానో అలరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి శ్రీకృష్ణ వేషధారణలతో వచ్చిన చిన్నారులచే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మరియు కృష్ణుడు ధర్మం వైపు నిలబడాలని గీతలో మనందరికీ బోధించినాడు ధర్మో రక్షతి రక్షిత అనే విషయాన్ని పిల్లలకు వివరించి చెప్పినారు ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# దుబ్బాకలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 03 :** దుబ్బాక సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్లో ముందస్తుగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పిల్లలు విద్యార్థులు అంతా కూడా శ్రీకృష్ణుడి వేషధారణలో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ట్రెస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాదు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, ఇలాంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారికి మానసిక ఉల్లాసం పొందుతారని, తద్వారా విద్యార్థులల్లో ఏకాగ్రత, పట్టుదల పెరుగుతుందని, దీని ద్వారా పిల్లల్లో మంచి ప్రవర్తన, సమాజం గురించి కూడా అర్థం చేసుకొని జీవితంలో మంచి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా విద్యార్థులు తమ జ్ఞానం పెంపొందించేందుకు కృషి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్రవంతి, స్వప్న, మనిష, స్వప్న, మమత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో గురువారం నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా రైతు రుణమాఫీ పూర్తిగా జరగలేదని, రైతుభరోసా, రైతుబీమా పథకాల విషయంలోనూ హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మూడున్నరేళ్లలోనే కాళేశ్వరం, కొండపోచమ్మసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి గోదావరి జలాలను పల్లెలకు తరలించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లోకి నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

**22-ఏ సమస్యను పరిష్కరించాలి**

22-ఏ పేరుతో ప్రజల భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. సామాన్య ప్రజల ఆస్తుల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. 22-ఏ సమస్యను వెంటనే పరిష్కరించి భూముల రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్‌వి ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, :**
మల్లియాల్‌లోని ఎన్ఎస్‌వి ఆల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ఉదయం కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా దాదాపు 100 మంది విద్యార్థులు చిన్నారి కృష్ణుడి వేషంలో, మరికొందరు గోపికల వేషంలో వచ్చారు. శ్రీకృష్ణుని జీవితంపై అవగాహన కల్పించడానికే తాము పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆల్ఫోర్స్ పాఠశాలల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి తన ప్రసంగంలో పేర్కొన్నారు. గోపికలు తాడు లాగుతుండగా, చిన్ని కృష్ణులందరూ వెన్న కుండను పగలగొట్టి చాలా ఆనందించారు.

## కోదురుపాకలో గ్రంథాలయ ఏర్పాటుకు విపంచి ఫౌండేషన్ 500 పుస్తకాల విరాళం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,:**
గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటును ప్రోత్సహించే ఉద్దేశంతో విపంచి ఫౌండేషన్ రాష్ట్రంలోని 20 గ్రామాలను ఎంపిక చేసి పుస్తకాలను విరాళంగా అందించింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని కోదురుపాక గ్రామానికి 500 పుస్తకాలను అందజేసింది.గురువారం హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్ చేతుల మీదుగా ఎంపిక చేసిన గ్రామాల ప్రతినిధులకు పుస్తకాలను అందజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కోదురుపాకలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల సుధాకర్ తెలిపారు.వి కేర్ ఫౌండేషన్ చైర్మన్ కత్తెరపాక సుధాకర్ సహకారంతో విపంచి ఫౌండేషన్ గురించి తెలుసుకుని, కోదురుపాకలో గ్రంథాలయం ఏర్పాటుకు పుస్తకాలు అందించాలని కోరినట్లు ఆమె వివరించారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఫౌండేషన్ రాష్ట్రంలోని 20 గ్రామాలను ఎంపిక చేసి పుస్తకాలు అందించడంతో పాటు కోదురుపాకకు 500 పుస్తకాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.ఈ పుస్తకాలు గ్రామంలోని విద్యార్థులు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, పఠన సంస్కృతిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కూడా ఎంతగానో దోహదపడతాయని సర్పంచ్ డా. మంజుల సుధాకర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వి కేర్ ఫౌండేషన్ చైర్మన్ కత్తెరపాక సుధాకర్, వార్డు సభ్యులు అన్నాళదాసు లక్ష్మీనారాయణ, బాలాగోని అనిల్, గ్రామ యువత ప్రతినిధి పందుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నరికివేతకు గురైన తాటిచెట్లను పరిశీలించిన తెలంగాణ గౌడ యువజన సంఘం సభ్యులు

- తాటిచెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: ఎక్సైజ్ అధికారులకు వినతి



**రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,:**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం ఫజుల్నగర్ గ్రామంలో అక్రమంగా నరికివేతకు గురైన తాటిచెట్లను తెలంగాణ గౌడ యువజన సంఘం సభ్యులు గ్రామ గౌడ సంఘం సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా తాటిచెట్లను అక్రమంగా నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కల్లు గీసుకునేందుకు ఉపయోగించే తాటిచెట్లను అక్రమంగా నరికివేయడం వల్ల గౌడ కుటుంబాల జీవనోపాధికి నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.ఇకపై తాటి, ఈత వనాలను ఎవరూ అక్రమంగా నరికివేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాటిచెట్ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సందీప్ గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటసాయి గౌడ్, ప్రధాన కార్యదర్శి అరవింద్, వంశీతో పాటు గ్రామ గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు పాటు క్రీడల్లో నైపుణ్యం పొందాలి

**సిద్దిపేట డీఈఓ రమేష్**

**కుకునూరుపల్లి, సెప్టెంబర్ 03, :**
కుకునూరుపల్లి విద్యార్థులు పాఠశాల స్థాయిలో చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పొంది రాణించాలని సిద్దిపేట డీఈవో రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజులపాటు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీలు ముగిసాయి. గురువారం రాత్రి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో డీఈవో మాట్లాడుతూ క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసంతో చదువుకొని మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు కీలకమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని పలువురు సూచించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించాలన్నారు. చదువులో రాణించడంతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు విజయాన్ని మాత్రమే కాకుండా ఓటమిని స్వీకరించే మనస్తత్వాన్ని కూడా నేర్పుతాయని తెలిపారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు కప్పులను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సెక్రెటరీ నర్రా భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కనకవ్వ ఐలయ్య , పిఎన్ఆర్ అధినేత పోల్కంపల్లి నరేందర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు డీఈఓ కుకునూరుపల్లి జిల్లా ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.




# రైతాంగంపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్

- ప్రభుత్వంపై బిఆర్ఎస్ సమరభేరి
- హామీలు అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ ర్యాలీలు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్

**చొప్పదండి/కోడిమ్యాల, సెప్టెంబర్ 02:**
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు సుంకె రవిశంకర్ ఆరోపించారు. గురువారం కోడిమ్యాల అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల అసమర్థ పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు రూ.15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. "రైతులకు రూ.15 వేల రైతు భరోసా ఇచ్చి రోడ్డుపైకి రావాలి.. లేదంటే ఏ ముఖం పెట్టుకొని ర్యాలీలు నిర్వహిస్తున్నారు" సిగ్గుందా అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు.కోడిమ్యాల మండలంలో ఇప్పటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ పూర్తిగా జరగలేదని ఆయన ఆరోపించారు. రైతులకు ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు తప్పడం లేదని, కాంగ్రెస్ పాలనలో రైతులు మళ్లీ అప్పుల కోసం సావకారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కె. చంద్రశేఖర్ రావు రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, 24 గంటల విద్యుత్ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచారని రవిశంకర్ పేర్కొన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల రైతుబీమా అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా లేదని, సాగునీటి సమస్యలు పెరిగాయని విమర్శించారు. కన్నెపల్లి పంపుల వద్ద పెద్ద మొత్తంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కోడిమ్యాల మండలంలో అనేక ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను 1000 రోజులు గడిచినా అమలు చేయలేదని రవిశంకర్ ఆరోపించారు. ప్రజలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పునుగోటి కృష్ణారావు, పులి వెంకటేశం గౌడ్, పిడుగు ప్రభాకర్ రెడ్డి, సురుగు శీను, కొత్తూరు స్వామి, భూపతి రెడ్డి, లింగ గౌడ్, చంద్రమోహన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఆదర్శంగా లక్ష్మీపూర్ సహకార సంఘం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 03:**
జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గారిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలువగా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి మొక్క అందజేసి అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

**ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ**

రైతులకు ఆదర్శంగా లక్ష్మీ పూర్ గ్రామ సహకార సంఘం సభ్యులు. క్లిష్ట పరిస్థితుల్లో సైతం రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేసింది. సివిల్ సప్లై మార్క్ ఫెడ్ లో 1లక్ష కోట్ల అప్పు ఉంది. ప్రతి ఏటా 11వేల కోట్ల వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తుంది. మిల్లర్ల నుండి రావాల్సిన బియ్యం రాక పోవడం తో విజిలెన్స్ తనిఖీ చేపట్టారు. ములుకనూరు సొసైటీ తరహాలో రైతు సహకార సంఘాలు అభివృద్ధి చెందాలని, ఆదర్శంగా నిలవాలన్నారు. కో ఆపరేటివ్ సొసైటీలు ఎఫ్పిఓలు బలోపేతం కావాలి. ప్రభుత్వం తరపున నా తరపున సహకారం ఉంటుంది. డిమాండ్ ఉన్న పంటలు పండించే విదంగా ఆలోచన చేయాలని, మూస పద్ధతిలో ఒక వరి పంట సాగు వద్దని అన్నారు. కూరగాయల సాగు మంచిది అని డిమాండ్ ఉందని అన్నారు. ఏకకాలంలో 21వేల కోట్ల రుణ మాఫీ ఒక చరిత్ర అని, ప్రతి పక్ష నాయకుల సీనియర్ నాయకులు కుటుంబ సభ్యులకు సైతం రుణ మాఫీ అయ్యింది అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు సంగేపు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు గోస్కుల మహేష్ ,డైరెక్టర్లు, మాజీ ఏఎంసి చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకుజాన్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లేష్, సర్పంచులు మోహన్ రెడ్డి, శేఖర్, మల్లేష్, బాపురెడ్డి, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## పోలాస వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌వి ఆల్ఫోర్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03,:**
ఎన్ఎస్‌వి ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు గురువారం పోలాస వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల సహకారంతో విద్యార్థులు వివిధ రకాల పంటలు, వాటి సాగు విధానం, మనుగడ తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.పంటలను సజీవంగా పరిశీలిస్తూ వాటి గురించి తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం వల్ల విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుందని పాఠశాలల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఇలాంటి విద్యా యాత్రలు విద్యార్థులకు విషయాలను ఆచరణాత్మకంగా నేర్చుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జీర్ణోద్ధరణ అంటే.. చరిత్రను చెరపడం కాదు!

## రాళ్ల మార్పు కాదు.. క్షేత్ర జీవనాడుల పరిరక్షణ

**ధర్మపురి నారసింహ క్షేత్ర పునరుద్ధరణలో అడుగడుగునా అప్రమత్తత అవసరం**

**ఆగమం.. వాస్తు.. శిల్పం.. పురావస్తు నిపుణుల సమన్వయమే కీలకం**

**పురాతన శాసనాలు, శిల్పాలు, దిక్పాలకుల ఆనవాళ్లను పదిలపరచాలి**

**శిల్పం నిలిస్తేనే చరిత్ర.. సంప్రదాయం బతికితేనే క్షేత్రం**



భారతీయ సంస్కృతీ స్రవంతిలో దేవాలయం అంటే కేవలం ఇటుకలు, రాళ్లతో నిర్మించిన కట్టడం కాదు. మంత్ర, తంత్ర, యంత్ర శాస్త్రాల సమన్వయ స్వరూపం. ఆధ్యాత్మిక చైతన్య కేంద్రం. శిల్పం, వాస్తు, ఆగమం, ఆరాధనా సంప్రదాయాలు, సామాజిక జీవన విలువలు కలగలిసిన సజీవ వారసత్వం. "దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవస్సనాతనః" అన్న ఆర్యోక్తి ప్రకారం ఆలయం భగవంతుని స్థూల శరీరమైతే.. గర్భగుడి దాని హృదయం. ప్రాకారాలు ప్రాణకోశాలు. మండపాలు, విమానం, పరివార దేవతల స్థానాలు అన్నీ ఒక నిర్దిష్టమైన ఆగమ, వాస్తు క్రమంలో అంతర్భాగాలు. అందుకే ప్రాచీన ఆలయానికి జీర్ణోద్ధరణ చేపట్టడమంటే పాత గోడలను కూల్చి ఆధునిక హంగులతో కొత్త నిర్మాణాలు చేపట్టడం కాదు. తరతరాలుగా సంక్రమించిన శిల్ప సౌందర్యం, ఆగమ ప్రామాణికత, ఆరాధనా సంప్రదాయం, చారిత్రక ఆనవాళ్లను చెక్కుచెదరకుండా కాపాడుతూ.. అత్యవసరమైన చోట మాత్రమే శాస్త్రబద్ధంగా మరమ్మతులు చేయడం. ఈ వివేకం లోపిస్తే ఎంత ధనం వెచ్చించినా ప్రయోజనం ఉండదు. ఆలయం కొత్తగా మెరిసిపోవచ్చు.. కానీ దాని చరిత్ర కనుమరుగవుతుంది. క్షేత్రం మిగులుతుంది.. కానీ దాని ఆత్మను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

### ధర్మపురి.. చరిత్రకు సజీవ సాక్ష్యం

పుణ్య గోదావరి దక్షిణవాహినిగా ప్రవహించే తీరాన వెలసిన ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ క్షేత్రాన్ని ఈ కోణంలోనే చూడాలి. వివిధ రాజవంశాల కాలానికి చెందిన చారిత్రక ఆనవాళ్లు, వేద విద్యా సంప్రదాయాలు, లలిత కళలు, హరి--హర ఆరాధనా సమన్వయంతో ధర్మపురికి ప్రత్యేక స్థానం ఉంది. క్షేత్ర మహాత్మ్య సాహిత్యం, శాసనాలు, స్థానిక వాఙ్మయ సంప్రదాయం ఈ ప్రాంతపు సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇక్కడి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యం ఉంది. స్వామివారి ఆరాధనతో ముడిపడిన సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఆలయం చుట్టూ అష్టదిక్కుల్లో క్షేత్రరక్షకులుగా హనుమంతుని విగ్రహాలు ఉండటం కూడా ఇక్కడి ఆగమ, వాస్తు సంప్రదాయంలో విశిష్ట అంశంగా భావిస్తారు. వీటిని కేవలం శిల్పాలుగా కాకుండా క్షేత్ర నిర్మాణ వ్యవస్థలో భాగంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### రెండు ఆలయాలు.. ఒకే చరిత్రగా చూడొద్దు

ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన అంశం యోగానంద నరసింహ ఆలయం, ఉగ్ర నరసింహ ఆలయాల చారిత్రక నేపథ్యం. ప్రధాన యోగానంద నరసింహ ఆలయానికి అత్యంత ప్రాచీనమైన ఆరాధనా సంప్రదాయం ఉందని క్షేత్ర వాఙ్మయం పేర్కొంటోంది. ఉగ్ర నరసింహ ఆలయాన్ని స్థానిక దాత పనతుల నారాయణ దీక్షితులు నిర్మించినట్లు స్థానిక చారిత్రక వివరాలు చెబుతున్నాయి. అందువల్ల ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణ ప్రణాళిక రూపొందించేటప్పుడు ప్రధాన యోగానంద నరసింహ ఆలయ చారిత్రక పరిధి, అనుబంధ ఆలయ ప్రత్యేకతలను కలగాపులగం చేయకూడదు. ఏ నిర్మాణం ఏ కాలానికి చెందినది? దాని అసలు స్వరూపం ఏమిటి? ఏ ఆరాధనా సంప్రదాయంతో ముడిపడి ఉంది? అనే అంశాలను శాస్త్రీయంగా నిర్ధారించిన తర్వాతే పనులు చేపట్టాలి.

### ఇంజినీరింగ్ ఒక్కటే సరిపోదు

ప్రాచీన దేవాలయ జీర్ణోద్ధరణ సాధారణ భవన నిర్మాణం కాదు. ఆగమాలు, శిల్పశాస్త్రం, వాస్తు సంప్రదాయాల్లో విమానం, ప్రాకారం, మండపం, గర్భగృహం వంటి నిర్మాణాలకు నిర్దిష్ట ప్రమాణాలున్నాయి. ధర్మపురిలోనూ విభిన్న వైదిక, ఆగమ, ఆరాధనా సంప్రదాయాలు కాలక్రమంలో కలగలిసి సజీవంగా కొనసాగుతున్నాయి. అందువల్ల కేవలం భవన నిర్మాణ ఇంజినీర్లు రూపొందించిన నమూనాతో ముందుకు వెళ్లడం సరికాదు. ఆగమ పండితులు, సంప్రదాయ ప్రధానార్చకులు, స్థపతులు, పురావస్తు నిపుణులు, వారసత్వ నిర్మాణాల సంరక్షణలో అనుభవమున్న స్ట్రక్చరల్ ఇంజినీర్లు కలిసి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. ముందుగా ప్రతి నిర్మాణ భాగాన్నీ శాస్త్రీయంగా నమోదు చేయాలి. ఏ రాయి పటిష్టంగా ఉంది? ఏది దెబ్బతింది? ఏ శిల్పానికి పరిరక్షణ అవసరం? అన్నది నిర్ధారించిన తర్వాతే జోక్యం చేసుకోవాలి. పటిష్టంగా ఉన్న పురాతన రాతిని కేవలం కొత్తదనం కోసం తొలగించడం జీర్ణోద్ధరణ కాదు.. వారసత్వ నష్టం. శతాబ్దాల నాటి శాసనాలు, స్తంభాలు, ద్వారశాఖలు, సూక్ష్మ శిల్పాలు, పాత రాతి నిర్మాణాలను యథాతథంగా పరిరక్షించాలి. వాటిపై విచక్షణారహితంగా రంగులు వేయడం, సిమెంటు పూతలు పూయడం, ఆధునిక టైల్స్‌తో కప్పేయడం వంటి చర్యలు పురాతన స్వరూపాన్ని శాశ్వతంగా దెబ్బతీయవచ్చు. జీర్ణోద్ధరణలో మొదటి సూత్రం 'కొత్తగా కనిపించాలి' అన్నది కాదు.. 'పాతది పదిలంగా ఉండాలి' అన్నదే కావాలి. ఉగ్ర నరసింహ ఆలయ పరిసరాల్లో గతంలో ఉన్నట్లు చెబుతున్న అష్టదిక్పాలకుల పీఠాలకు సంబంధించిన అంశాన్ని కూడా లోతుగా పరిశోధించాలి. ప్రస్తుతం అగ్ని, కుబేర, ఇంద్ర విగ్రహాలు మాత్రమే లభ్యమవుతున్నట్లయితే.. మిగిలిన దిక్పాలక విగ్రహాలు ఎక్కడ ఉండేవి? ఎప్పుడు అదృశ్యమయ్యాయి? పాత నిర్మాణ మార్పుల్లో తొలగించబడ్డాయా? మరెక్కడైనా భద్రపరిచారా? అన్నది తేల్చాలి. దీనికోసం పాత ఛాయాచిత్రాలు, దేవస్థాన రికార్డులు, శాసనాలు, స్థల నమూనాలు, స్థానిక అర్చక కుటుంబాల మౌఖిక చరిత్రను పరిశీలించాలి. సరైన ఆధారాలు లభించకుండానే కొత్త విగ్రహాలను తయారు చేసి పాతవాటి స్థానంలో ప్రతిష్ఠించడం కంటే ముందు ఆగమ, పురావస్తు నిపుణుల అభిప్రాయం తీసుకోవడం అత్యవసరం. అదేవిధంగా ఆలయ తూర్పు దిశలో వెలుపల ఉన్న గణపతి విగ్రహాన్ని తరలించే విషయంలోనూ తొందరపాటు పనికిరాదు. క్షేత్ర ప్రవేశ వాస్తులో ఆ విగ్రహ స్థానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందా? ద్వార విఘ్నేశ్వరుడిగా లేదా క్షేత్ర సంరక్షకుడిగా ప్రతిష్ఠించారా? అనే అంశాలను పాత క్షేత్ర నమూనాలు, ఆగమ సంప్రదాయం ఆధారంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. జీర్ణోద్ధరణలో అన్నింటికంటే ముఖ్యమైనది గర్భగుడిలోని మూలవిరాట్టు భద్రత. భారీ యంత్రాల కంపనాలు, నిర్మాణ దుమ్ము, రసాయనాలు, సున్నం తదితరాల ప్రభావం మూలమూర్తిపై పడకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే సంబంధిత ఆగమ సంప్రదాయం ప్రకారం బాలాలయం ఏర్పాటు, కలశ స్థాపన, అంకురార్పణ, మృత్సంగ్రహణం, హోమాది క్రతువులు నిర్వహించాలి. నిర్మాణ పనులు పూర్తయ్యాక సంబంధిత సంప్రదాయం ప్రకారం అష్టబంధన, మహాకుంభాభిషేకం, సంప్రోక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. అదే సమయంలో నిత్య పూజలు, తీర్థప్రసాదాల వితరణ, ఉత్సవాలు, స్వామివారి ప్రదక్షిణ, సంచార మార్గాలకు ఆటంకం కలగకుండా పనులను దశలవారీగా చేపట్టాలి. నేడు అనేక పుణ్యక్షేత్రాల్లో ఆధునికీకరణ పేరుతో మార్బుల్, గ్రానైట్, మెరిసే టైల్స్, అద్దాలు, ఇతర అలంకరణలను విచక్షణారహితంగా ఉపయోగించడం వల్ల పాత ఆలయాల సహజ స్వరూపం మారిపోతోంది. ధర్మపురిలో అలాంటి పొరపాటుకు తావివ్వరాదు. గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, విమానం వంటి కీలక నిర్మాణాల్లో అసలు నిర్మాణ పదార్థం, శైలి, కాల స్వభావాన్ని గుర్తించి దానికి అనుగుణమైన పరిరక్షణ పద్ధతులనే అనుసరించాలి. డ్రైనేజీ, విద్యుత్ తీగలు, వర్షపు నీటి నిర్వహణ, భక్తుల క్యూలైన్లు, అగ్నిమాపక భద్రత వంటి ఆధునిక సదుపాయాలు అవసరమే. కానీ అవి ఆలయ సంప్రదాయ రూపాన్ని కప్పివేయకుండా, వీలైనంత వరకు కనబడని విధంగా అమర్చాలి. పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షణకు వర్తించే చట్టాలు, నిబంధనలు, నిపుణుల సూచనలను పాటిస్తూ ప్రతి అడుగు వేయాలి. ఎందుకంటే ఆలయంలో తొలగించే ప్రతి పురాతన రాయి ఒక చరిత్రపుట కావచ్చు. ప్రతి శాసనం గతానికి సాక్ష్యం కావచ్చు. ప్రతి శిల్పం భావితరాలకు అందించాల్సిన సంస్కృతీ సంపద కావచ్చు.

### ఇది కాంట్రాక్టు కాదు.. పరిరక్షణ యజ్ఞం

ధర్మపురి ఉగ్ర నరసింహ ఆలయ పునరుద్ధరణను సాధారణ సివిల్ కాంట్రాక్టు పనిగా చూడకూడదు. ఒక అపురూప వైదిక, చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు భద్రంగా అందించే పరిరక్షణ యజ్ఞంగా భావించాలి. శాసనం నిలిస్తేనే నేల చరిత్ర నిలుస్తుంది. శిల్పం నిలిస్తేనే జాతి సంస్కృతి నిలుస్తుంది. సంప్రదాయం బతికితేనే క్షేత్ర వైభవం కలకాలం వర్ధిల్లుతుంది. ఆగమం మార్గదర్శిగా.. వాస్తు పునాదిగా.. శిల్పం రూపంగా.. సంప్రదాయం అంతఃప్రాణంగా.. ఆధునిక శాస్త్ర సాంకేతికత రక్షణ కవచంగా సాగే సమన్వయ జీర్ణోద్ధరణే ధర్మపురి నారసింహ క్షేత్రానికి అసలైన గౌరవం. అదే మన పూర్వీకులు అందించిన అమూల్య వారసత్వాన్ని భావితరాల చేతుల్లో భద్రంగా పెట్టే నిజమైన బాధ్యత.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెల్లవారక ముందే..

## వార్తను గుమ్మానికి చేర్చే వారధులు!



### నేడు అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం

ఆధునిక సమాజంలో సమాచార ప్రపంచం అనూహ్య వేగంతో మారుతోంది. స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల ద్వారా సమాచారం క్షణాల్లో ప్రపంచమంతా చేరుతోంది. ప్రత్యక్ష ప్రసారాలు, ఎప్పటికప్పుడు వచ్చే తాజా సమాచారం, బ్రేకింగ్ న్యూస్ ప్రజలను డిజిటల్ మాధ్యమాల వైపు ఆకర్షిస్తున్నాయి. ఈ వేగంతో సంప్రదాయ ప్రింట్ మీడియా పోటీ పడటం సవాలుగా మారింది. అయినప్పటికీ ఉదయం లేవగానే చేతిలో పత్రిక ఉండాలనుకునే పాఠకులు ఇప్పటికీ ఉన్నారు. ఆ పత్రికను ముద్రణాలయం నుంచి పాఠకుడి గుమ్మం వరకు చేర్చే చివరి, అత్యంత కీలకమైన వారధి పేపర్‌బాయ్. సెప్టెంబర్ 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం సందర్భంగా.. ప్రతిరోజూ ప్రపంచాన్ని మన గుమ్మం ముందు ఉంచుతున్న వారి శ్రమను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా తెలుసుకోవాలంటే వార్తాపత్రికే ప్రధాన ఆధారం. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేశాయి. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు వివరించడం, సామాజిక చైతన్యాన్ని



పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయి. దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు సాహిత్యం, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్యం, విజ్ఞానం, ఆధ్యాత్మికతకు ప్రత్యేక పత్రికలు ఉండేవి. 'చందమామ', 'బాలమిత్ర', 'బొమ్మరిల్లు' వంటి బాలల పత్రికలు ఎన్నో తరాల బాల్య జ్ఞాపకాల్లో భాగమయ్యాయి. సమాచార వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో ఉదయం రావాల్సిన పత్రిక మధ్యాహ్నానికి పాఠకుడి చేతికి చేరిన సందర్భాలూ ఉండేవి. కాలక్రమంలో పత్రికా రంగం విస్తరించింది. ప్రచురణ కేంద్రాలు పెరిగాయి. ముద్రణ వేగం పెరిగింది. రవాణా, పంపిణీ వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తెల్లవారకముందే పత్రికను పాఠకుడి గుమ్మానికి చేర్చే వ్యవస్థ ఏర్పడింది. ఈ మొత్తం వ్యవస్థలో చివరి అంచున నిలబడి పత్రికను పాఠకుడి చేతికి అందించే బాధ్యతను భుజాన వేసుకున్నవాడే పేపర్‌బాయ్. పాత్రికేయులు రోజంతా తిరిగి వార్తలను సేకరిస్తారు. ఉప సంపాదకులు వాటిని తీర్చిదిద్దుతారు. సంపాదకుల పర్యవేక్షణలో పేజీలు సిద్ధమవుతాయి. ముద్రణ యంత్రాల్లో పత్రిక రూపుదిద్దుకుంటుంది. కానీ ఆ పత్రిక పాఠకుడి చేతికి చేరకపోతే ఆ మొత్తం శ్రమ అసంపూర్ణమే. అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే పంపిణీ వాహనాల కోసం ఎదురుచూడటం.. వచ్చిన పత్రిక కట్టలను విప్పడం.. అనుబంధాలు, ప్రత్యేక సంచికలను ప్రధాన పత్రికలో అమర్చడం.. చందాదారుల వారీగా పత్రికలను వేరు చేయడం.. ఆ తర్వాత సైకిల్, ద్విచక్ర వాహనం లేదా కాలినడకన వీధివీధి తిరగడం వారి నిత్యకృత్యం. ప్రపంచం ఇంకా నిద్రలో ఉండగానే వారి రోజు మొదలవుతుంది. ఇంటింటికీ ఆగి పత్రికను ముంగిట్లో వేయడం.. గేట్ల మధ్య నుంచి అందించడం.. పై అంతస్తుల్లోకి విసరడం.. ఏ ఇంటికి ఏ పత్రిక వేయాలో గుర్తుపెట్టుకోవడం.. ఇదంతా వారికి రోజువారీ జీవితంలో భాగమే. ఎండైనా.. వానైనా.. చలైనా.. పండుగైనా.. పత్రిక మాత్రం పాఠకుడి గుమ్మానికి చేరాల్సిందే. పేపర్‌బాయ్ పని ఎంతోమందికి జీవనోపాధి. మరికొందరికి చదువుకు ఆసరా. కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తెల్లవారుజామున పత్రికలు పంచి, ఆ తర్వాత కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా కనిపిస్తుంటారు. ఉదయం పత్రికల పంపిణీ పూర్తిచేసి మరో ఉపాధికి వెళ్లేవారూ ఎందరో ఉన్నారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరిన పలువురు ప్రముఖుల బాల్యం, విద్యార్థి జీవితాల్లోనూ వార్తాపత్రికల పంపిణీతో అనుబంధం ఉన్న ఉదాహరణలు కనిపిస్తాయి. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిన్నతనంలో వార్తాపత్రికల పంపిణీ చేసిన విషయం ఆయన జీవితచరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. అలాంటి అనుభవాలు ఏ పనీ చిన్నది కాదనే జీవిత సత్యాన్ని చాటుతాయి. పేపర్‌బాయ్ జీవితం వెండితెరకూ కథావస్తువైంది. జయశంకర్ దర్శకత్వంలో సంతోష్ శోభన్, రియా సుమన్, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'పేపర్ బాయ్' తెలుగు చిత్రం 2018 ఆగస్టు 31న విడుదలైంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రంలో పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత తదితరులు నటించారు. సామాజిక మాధ్యమాలు వేగంగా విస్తరించినప్పటికీ ప్రింట్ మీడియా ప్రాధాన్యం పూర్తిగా కనుమరుగైపోలేదు. విశ్లేషణాత్మక కథనాలు, సంపాదకీయాలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, ప్రకటనలు, ఉద్యోగ సమాచారం వంటి అనేక అంశాల్లో ముద్రిత పత్రికలకు ఇప్పటికీ ప్రత్యేక పాఠక వర్గం ఉంది. పత్రికా రంగానికి ప్రభుత్వాలు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అందిస్తున్నాయి. పాత్రికేయుల సంక్షేమం గురించి చర్చ జరుగుతోంది. పత్రికా సంస్థల మనుగడపై చర్చ జరుగుతోంది. కానీ ఈ వ్యవస్థలో చివరి మెట్టుగా నిలిచే పేపర్‌బాయ్‌ల సంక్షేమం గురించి కూడా అంతే స్థాయిలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. పేపర్‌బాయ్‌లలో చాలామంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ప్రయాణం, ప్రతికూల వాతావరణం, రోడ్డు ప్రమాదాల ముప్పు, తక్కువ ఆదాయం వంటి అనేక ఇబ్బందుల మధ్య వారు తమ పని కొనసాగిస్తున్నారు. చదువుకోసం, కుటుంబ పోషణ కోసం, ఆర్థిక స్వావలంబన కోసం ఈ వృత్తిని ఎంచుకున్న వారెందరో ఉన్నారు. వారు చేస్తున్న పని చిన్నదా.. పెద్దదా అన్నది ప్రశ్న కాదు. పత్రికను పాఠకుడి చేతికి చేర్చే వారి శ్రమ లేకుండా ప్రింట్ మీడియా ప్రయాణం పూర్తికాదన్నదే వాస్తవం. అందుకే పత్రికా యాజమాన్యాలతో పాటు ప్రభుత్వాలు కూడా వారి సేవలను గుర్తించి సంక్షేమం, బీమా, ప్రమాద భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలి. పాత్రికేయుడు వార్తను వెతుకుతాడు.. సంపాదకుడు దానికి రూపమిస్తాడు.. ముద్రణ యంత్రం అక్షరాలుగా మలుస్తుంది.. కానీ ఆ అక్షర ప్రపంచాన్ని ప్రతి ఉదయం మన గుమ్మానికి మోసుకొచ్చేది పేపర్‌బాయే. ఊరు మేల్కొనేలోపే అతడి పని మొదలవుతుంది.. మనం పత్రిక తిరగేస్తున్న సమయానికి అతడి ప్రయాణం ఎన్నో గడపలు దాటిపోతుంది. ఆ నిరుపమాన సేవకు గుర్తింపే అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవానికి అసలైన అర్థం.



# ఘోర ఓటమి

## భారత్‌పై పాక్ అక్కసు!

ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో పరాజయం

పాక్ క్రికెట్ బోర్డుపై మాజీ ఆటగాళ్ల విమర్శలు

జట్టు ప్రదర్శనను సమర్థించిన మోసిన్ నఖ్వీ

చిన్న జట్ల చేతిలో పెద్ద జట్ల ఓటముల ప్రస్తావన

భారత్ ఓటమిని పరోక్షంగా గుర్తుచేశారంటున్న విశ్లేషకులు

**ఢిల్లీ, సెప్టెంబర్ 2 :** ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర పరాజయాలు ఎదురైనా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకున్నారు. పాక్ క్రికెట్ పతనానికి బోర్డు వ్యవహారశైలే కారణమంటూ ఆ దేశ మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు కూడా ఓడిపోయాయని నఖ్వీ వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. "ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతమాత్రాన అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా?" అని నఖ్వీ ప్రశ్నించారు. జట్టుకు అవసరమైన ఆటగాళ్లను కచ్చితంగా ఎంపిక చేస్తామని చెప్పారు. ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోతే బోర్డు మాత్రం ఏం చేయగలదని ప్రశ్నించారు. తమకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ముఖ్యమేనని పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌తో రెండు టెస్టుల్లో ఓటమిని తేలిగ్గా తీసుకోవడం లేదని నఖ్వీ స్పష్టం చేశారు. వన్డేలు, టీ20ల్లో సాధించిన పురోగతిని టెస్టుల్లోనూ కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. విమర్శలకు తాను ఎప్పుడూ భయపడలేదని, ఇకముందూ భయపడబోనని చెప్పారు.

### ర్యాంకింగ్స్ చూపిస్తున్న నఖ్వీ

తాను పీసీబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాకిస్థాన్ క్రికెట్ నాశనమైందంటున్న వారు గత ర్యాంకింగ్స్‌ను కూడా చూడాలని నఖ్వీ సూచించారు. వన్డేల్లో ఎనిమిదో స్థానం నుంచి ఐదో స్థానానికి, టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి జట్టు చేరిందని పేర్కొన్నారు. ఈ పురోగతిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అయితే చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిన విషయాన్ని నఖ్వీ ప్రస్తావించడం వెనుక భారత్, దక్షిణాఫ్రికా ఇటీవల ఎదుర్కొన్న పరాజయాలను ఉద్దేశించి ఉండొచ్చని క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. పాకిస్థాన్ జట్టు వైఫల్యాలపై దృష్టి పెట్టకుండా ఇతర జట్ల ఓటములను ఉదాహరణగా చూపడం ఎంతవరకు సమంజసమన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. వరుస టెస్టు పరాజయాలతో పాక్ క్రికెట్‌పై సొంత దేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో నఖ్వీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరో వివాదానికి తెరతీశాయి.

# కెప్టెన్ సంచలనం.. 5 పరుగులకే 7 వికెట్లు!

- హ్యాట్రిక్‌తో చమరి అటపట్టు విధ్వంసం
- ఇండోనేషియాపై శ్రీలంక 75 పరుగుల ఘన విజయం
- మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున తొలి హ్యాట్రిక్
- 49 పరుగులకే కుప్పకూలిన ఇండోనేషియా
- అర్ధ సెంచరీతో ఆదుకున్న నీలాక్షిక సిల్వా



**క్రీడా విభాగం:** మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు బంతితో సంచలనం సృష్టించింది. కేవలం 5 పరుగులిచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టడంతో పాటు హ్యాట్రిక్ సాధించి ఇండోనేషియా బ్యాటింగ్‌ను కకావికలం చేసింది. ఫలితంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 75 పరుగుల భారీ తేడాతో ఇండోనేషియాను చిత్తు చేసింది. టాస్ గెలిచిన ఇండోనేషియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఆ జట్టు బౌలర్లు శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. రెండో ఓవర్లోనే ఇమేషా దులానీని పెవిలియన్‌కు పంపించారు. ఆ తర్వాత స్పిన్నర్లు వరుసగా వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక ఒక దశలో 36 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. 68 పరుగుల వద్ద ఆరో వికెట్ కూడా పడడంతో స్వల్ప స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. ఈ దశలో నీలాక్షిక సిల్వా జట్టును ఆదుకుంది. ఆరంభంలో ఎంతో ఓపికగా ఆడిన ఆమె చివరి ఓవర్లలో వేగం పెంచింది. సిక్సర్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో అర్ధ సెంచరీ. సిల్వా 50 పరుగులతో రాణించడంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 124 పరుగులు చేసింది.

### అటపట్టు స్పిన్‌కు విలవిల

125 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండోనేషియాకు అటపట్టు చుక్కలు చూపించింది. ఓపెనర్ పాంగెస్టుటిని ఔట్ చేసిన ఆమె ఆ తర్వాత వరుసగా వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్నువిరిచింది. పది ఓవర్లు ముగిసేసరికే ఇండోనేషియా 29 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. శ్రీలంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇండోనేషియా బ్యాటర్లు పరుగుల కోసం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రెండో ఓవర్ నుంచి 15వ ఓవర్ వరకు వారి బ్యాట్ నుంచి ఒక్క బౌండరీ మాత్రమే రావడం శ్రీలంక ఆధిపత్యానికి అద్దం పట్టింది.

### వరుసగా మూడు.. చరిత్రలో తొలి హ్యాట్రిక్

చివర్లో అటపట్టు మరింత చెలరేగింది. అరియాని, మాయ్‌ప్రియాని, పరమితిని వరుస బంతుల్లో ఔట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక తరఫున ఇదే తొలి హ్యాట్రిక్‌గా నిలిచింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అటపట్టుకు ఇదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కూడా కావడం విశేషం. చివరకు ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 పరుగులకే ఆలౌటైంది. అటపట్టు కేవలం 5 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టి కెరీర్ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసింది. మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది. సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక 20 ఓవర్లలో 124/7 (నీలాక్షిక సిల్వా 50, సంజన కవిందీ 15; దేవి 3/23, మాయ్‌ప్రియాని 2/19). ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 ఆలౌట్ (సువాండేవి 12, పాంగెస్టుటి 10; చమరి అటపట్టు 7/5, కుమారి 1/3). శ్రీలంక 75 పరుగుల తేడాతో విజయం.

# బీసీసీఐ కీలక భేటీ.. లక్ష్మణ్‌కు అదిరే ఛాన్స్!

టీమిండియా ప్రదర్శనపై ఉన్నతస్థాయి సమీక్ష

గంభీర్, గిల్, అయ్యర్‌తో బోర్డు పెద్దల చర్చలు

న్యూజిలాండ్ పర్యటనపై ప్రత్యేక దృష్టి

రోహిత్ వన్డే భవిష్యత్తుపైనా చర్చ

ఆసియా క్రీడలకు భారత కోచ్‌గా లక్ష్మణ్



**ముంబై, సెప్టెంబర్ 3:** భారత క్రికెట్ జట్టు భవిష్యత్ కార్యాచరణపై బీసీసీఐ కీలక సమీక్ష నిర్వహించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వ్యక్తిగత కారణాలతో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సమావేశానికి హాజరుకాలేదు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, కోశాధికారి ప్రభతేజ్ సింగ్ భాటియా, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమీన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనతో పాటు వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో భారత జట్టు ప్రదర్శన, ఆటగాళ్ల ఫిట్‌నెస్, భవిష్యత్ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఆడిన ఆరు టీ20ల్లో భారత్ ఒక్క విజయమూ సాధించకపోవడంపైనా సమీక్షించినట్లు తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌తో జరగనున్న అన్ని ఫార్మాట్ల సిరీస్‌పైనా ప్రత్యేకంగా చర్చించారు. ఈ పర్యటనలో ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు జరగనున్నాయి. ఆటగాళ్ల పనిభారం నియంత్రణతో పాటు కీలక ఆటగాళ్లకు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవడంపై కోచింగ్ బృందం స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.

### రోహిత్ భవిష్యత్తుపైనా చర్చ?

సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. రోహిత్ రిటైర్మెంట్‌పై వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇప్పటికే ఖండించినప్పటికీ.. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయన పాత్రపైనా చర్చ కొనసాగుతున్నట్లు సమాచారం.

### లక్ష్మణ్‌కు కీలక బాధ్యత

మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు కీలక బాధ్యత దక్కనుంది. 2026 ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రికెట్ జట్టుకు ఆయన ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. లక్ష్మణ్‌తో పాటు సునీల్ జోషి, హృషికేష్ కనిట్కర్, సుభాదీప్ ఘోష్ కోచింగ్ బృందంలో ఉండనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, వీవీఎస్ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# నీరజ్ స్థానంలో 24 ఏళ్ల 'బడిసె వీరుడు'!

ఆసియా క్రీడలకు యశ్వీర్ సింగ్ ఎంపిక

గాయంతో మెగా టోర్నీకి నీరజ్ దూరం




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత జావెలిన్ త్రో విభాగంలో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ మెగా టోర్నీకి దూరం కావడంతో అతడి స్థానంలో 24 ఏళ్ల యశ్వీర్ సింగ్‌కు అవకాశం దక్కింది. ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకంతో మెరిసిన యశ్వీర్‌ను భారత అథ్లెటిక్స్ జట్టులోకి తీసుకున్నట్లు అథ్లెటిక్స్ సమాఖ్య గురువారం వెల్లడించింది. గత కొంతకాలంగా అంతర్జాతీయ జావెలిన్ త్రోలో భారత్‌కు పతకాల పంట పండిస్తున్న నీరజ్ చోప్రా ఈసారి ఆసియా క్రీడల్లో కనిపించడు. కాలి మడమకు గాయం కారణంగా అతడు పోటీలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో నీరజ్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం యువ జావెలిన్ త్రోయర్ యశ్వీర్ సింగ్‌ను వరించింది. యశ్వీర్ ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో 85.41 మీటర్ల దూరం ఈటెను విసిరి కాంస్య పతకం సాధించాడు. ఆ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ 24 ఏళ్ల యువ అథ్లెట్ ఇప్పుడు ఆసియా వేదికపై భారత్‌కు మరో పతకం అందించాలనే పట్టుదలతో ఉన్నాడు. జావెలిన్ త్రోలో భారత్ తరఫున యశ్వీర్‌తో పాటు రోహిత్ యాదవ్ కూడా బరిలోకి దిగనున్నాడు. ఇద్దరూ కలిసి పతక వేట సాగించనున్నారు. అయితే వారికి శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరగేతో పాటు పాకిస్థాన్ స్టార్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. నీరజ్ చోప్రా లేని లోటును యువ అథ్లెట్లు ఎంతవరకు భర్తీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# 'ఇంపాక్ట్' వద్దు.. ఆడితే ఫుల్‌గానే!

ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై మళ్లీ ఉత్కంఠ

పూర్తి స్థాయి కీపర్‌గానే ఆడాలని నిర్ణయం

బద్రీనాథ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ


ఫిట్‌నెస్‌పైనే భవిష్యత్తు ఆధారం




**చెన్నై, సెప్టెంబర్ 3:** ఐపీఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ భవిష్యత్తుపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొనసాగితే పూర్తి స్థాయి వికెట్ కీపర్–బ్యాటర్‌గానే ఆడాలని ధోనీ భావిస్తున్నారని, కేవలం 'ఇంపాక్ట్ ప్లేయర్' పాత్రకు ఆయన సిద్ధంగా లేరని సీఎస్కే మాజీ బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ వెల్లడించారు. దీంతో 2027 ఐపీఎల్‌లో ధోనీ కొనసాగుతారా? లేక తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్న చర్చ మొదలైంది. వయసు, గతంలో ఎదురైన మోకాలి సమస్యలను దృష్టిలో పెట్టుకుంటే మ్యాచ్ మొత్తం వికెట్ కీపింగ్ చేయడం ధోనీకి సవాలుగా మారవచ్చని బద్రీనాథ్ అభిప్రాయపడ్డారు. పనిభారం తగ్గించుకునేందుకు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన ఉపయోగపడుతుందని, చివరి ఓవర్లలో బ్యాటింగ్‌కు వచ్చి ఫినిషర్‌గా సేవలందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల సీఎస్కేకు వ్యూహాత్మక ప్రయోజనం కూడా ఉంటుందన్నారు. అయితే ధోనీ మాత్రం తనను పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే భావిస్తున్నారని బద్రీనాథ్ తెలిపారు. సగం మ్యాచ్‌కే పరిమితమయ్యే ఇంపాక్ట్ ప్లేయర్ పాత్రపై ఆయన ఆసక్తి చూపడం లేదన్నారు. ఆడితే వికెట్ కీపర్--బ్యాటర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వర్తించాలన్నదే ధోనీ ఆలోచనగా పేర్కొన్నారు.

### ఫిట్‌నెస్‌పైనే అసలు నిర్ణయం

గత కొన్ని సీజన్లుగా ధోనీ మోకాలి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. 2024 సీజన్‌కు ముందు సీఎస్కే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న ఆయన.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ ఎక్కువగా చివరి ఓవర్లకే పరిమితమయ్యారు. దీంతో వయసు, ఫిట్‌నెస్, పనిభారం దృష్ట్యా రాబోయే సీజన్‌లో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించి సీఎస్కేను అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిపిన ధోనీకి అభిమానుల్లో ఉన్న క్రేజ్ ప్రత్యేకం. అయితే 'ఇంపాక్ట్ ప్లేయర్'గా కాకుండా పూర్తి స్థాయి వికెట్ కీపర్‌గానే ఆడాలన్న ఆయన వైఖరి నేపథ్యంలో 2027 ఐపీఎల్‌లో ధోనీ కనిపిస్తారా?.. లేక ఐపీఎల్ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్నదానికి ఆయన ఫిట్‌నెస్, తుది నిర్ణయమే సమాధానం చెప్పనుంది.



# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి

సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.




# 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'

ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.



బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే బోల్డ్ లుక్‌లో అందాలు ఆరబోశారు. గ్లామరస్ చూపులతో యూత్ మనసు దోచేలా ఉన్న క్యూట్ ఫోటో షూట్ ట్రెండ్ అవుతోంది.






# టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్

రాకింగ్ స్టార్ యష్ నటించిన టాక్సిక్ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద జర్నీని కొనసాగిస్తున్నది. ఈ చిత్రం కన్నడ, హిందీ భాషల్లో భారీ వసూళ్లను సాధిస్తున్నది. అయితే గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేయకుండా నిర్ణయం తీసుకొన్నారు. అయితే దాదాపు రెండో వారంలో ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేసేందుకు సిద్ధమయ్యారు. భారతీయ సినిమా రంగంలో అగ్రతారలు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ నటించిన ఈ సినిమాను దక్షిణాదిలో అగ్ర సినీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కే నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్‌ను వాయిదా వేశారు. టాక్సిక్ విషయానికి వస్తే.. ఈ సినిమాను ఒరిజినల్‌గా కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో షూట్ చేశారు. దానిని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లోకి డబ్ చేసి విడుదల చేశారు. అయితే ఇంగ్లీష్ భాషలో రూపొందించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడిందని చిత్ర యూనిట్ వెల్లడించింది. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను సెప్టెంబర్ 4వ తేదీన రిలీజ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పరిమితమైన లోకేషన్లు అంటే.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, తిరువనంతపురం, ఇతర ప్రాంతాల్లో రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు రీ సెన్సార్ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ సినిమా ఇండియన్ లాంగ్వేజ్ రన్ టైమ్ విషయానికి వస్తే.. ఈ చిత్రం నిడివి 3 గంటల 14 నిమిషాలు. అంటే.. 194 నిమిషాల రన్ టైమ్‌తో రిలీజ్ చేశారు. కానీ ఇంగ్లీష్ వెర్షన్ విషయానికి వస్తే.. భారీగా కోత పెట్టారు. ఇంగ్లీష్ వెర్షన్‌లో 17 నిమిషాల సన్నివేశాలను తొలగించారు. అంటే ఫైనల్ కట్ 2 గంటల 57 నిమిషాలు అంటే.. 177 నిమిషాల రన్ టైమ్‌తో విడుదల చేస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఇదిలా ఉండగా,భారతీయ భాషల్లో రిలీజైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ఇండియాలో 280 కోట్లకుపైగా గ్రాస్, 235 కోట్ల రూపాయల నెట్ వసూళ్లను సాధించింది. ఓవర్సీస్‌లో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే.. ఇంకా భారీగా వందల కోట్లు రాబట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com